ప్రజాశక్తి

బుధవారం 28 డిసెంబర్ 2022 8 పేజీలు

గుంటూరు పల్నాడు

పింఛనుకు ఎసరు

- పండుటాకుల పరేషాన్, వికలాంగుల పాట్లు
- వితంతువులు, ఒంటరి మహిళలకు తప్పని కష్టాలు
- ఆరు అంచెల నిబంధన పేరుతో లబ్ధిదార్లకు కోత
- గుంటూరు, పల్నాడు జిల్లాలో 16 వేల మందికి?

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో దాదాపు 16 వేల పింఛన్లు తొలగింపునకు రంగం సిద్ధమైంది. దాదాపు 20 వేల మందికిపైగా అనర్హత పేరుతో నోటీసులు రాగా వీరిలో కొంత మంది ఎంతో ప్రయాసపడి అధికారులు చేసిన తప్పిదాలను ఎత్తి చూపి తమ పేర్లు తొలగించకుండా చూసుకుంటున్నారు. అయితే చాలా మంది కార్యాలయాల చుట్టూ తిరగలేక తగిన సమాధానం చెప్పలేక మౌనంగా ఉండటం వల్ల జనవరి నెల నుంచి పింఛన్లు కోల్పోయేపరిస్థితి ఏర్పడింది. నోటీసులు అందుకున్న 20 వేల మందిలో నాలుగు వేల మంది వరకు తగిన పత్రాలతో తగిన వివరణిచ్చి పునరుద్ధరణకు ప్రయత్నించే అవకాశం ఉందని, మిగతా వారి పింఛన్లు తొలగించక తప్పకపోవచ్చునని అధికారులు చెబుతున్నారు.

ప్రధానంగా 6 ఆంచెల నిబంధన వల్ల చాలామంది వీటి నుంచి తప్పించుకోలేకపోతున్నారు. నాలుగు చక్రాల వాహనం గూడ్స రవాణా నిమిత్తం తిప్పుకుంటున్నా, ట్రావెల్స్ పద్ధతిలో కారున్నా అందుకయ్యే పన్నులు చెల్లించలేక సొంత అవసరాలకు వినియోగించుకుంటున్నట్టుగా నమోదు చేయించుకోవడం వల్ల ఇప్పుడు సామాజిక పింఛన్లు, బియ్యం కార్డు, ఇతర సదుపాయాలు కోల్పోవాల్సి వస్తుందని తెలిసింది. మూడు, నాలుగు పోర్షన్లకు కలిపి ఒకటే మీటరున్నా ఇదే పరిస్థితి. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన ప్రజా సాధికారిక సర్వే, వైసిపి ప్రభుత్వం చేపట్టిన నవశకం సర్వేలో చేసిన మ్యాపింగ్ తప్పిదాల వల్ల కూడా చాలా మందికి పింఛను అర్హత కోల్పోయేలా చేసింది. పూర్తిగా వికలాంగులు అయినా సంబంధిత బియ్యం కార్డులో ప్రభుత్వ ఫ్యామిలీ పింఛన్లు పొందుతున్నవారు ఉంటే వికలాంగులు, వృద్ధులు, వితంతు పింఛన్లు తొలగిస్తున్నారు.

గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లో ఒక ఉన్నత ఉద్యోగి ఇంట్లో పనిచేసే పని మనిషికి ఐటి రిటర్న్ ఉందని అధికారులు నోటీసులిచ్చారు. పనిచేసే ఇంట్లోనే నివాసం ఉంటున్నట్టు వాలంటీరు మ్యాపింగ్ చేయడం వల్ల ఈ ఇబ్బంది ఏర్పడింది. వెయ్యి అడుగుల కంటే ఎక్కువ విస్తీర్ణం కలిగిన స్థలంలో ఇల్లు ఉన్నా కార్డు రద్దు చేస్తున్నారు. సాధారణంగా 300 యూనిట్లు దాటి విద్యుత్ బిల్లు వచ్చినా, సొంత కారున్నా, ఆదాయం పన్ను లేక జిఎస్‌టి రిటర్ను కలిగి ఉన్నా, ప్రభుత్వ పింఛను దారుడు కార్డులో ఉన్నా, 5 ఎకరాల మెట్ట, రెండున్నర ఎకరాల మాగాణి భూమి ఉన్నా, వెయ్యి చదరపు అడుగుల కంటే ఎక్కువ స్థలం ఉన్నా రేషన్

▸ 2లో

పాలపర్రులోని నారాయణ స్వగృహంలో విషాదంలో కుటుంబీకులు, బంధువులు

పాలపర్రు, అన్నపర్రు గ్రామాల్లో విషాదం

- అమెరికాలోని సదస్సు వద్ద ప్రమాదానికి గురైన దంపతులు
- భార్యమృతి, భర్త గల్లంతు.. క్షేమంగా బయటపడ్డ ఇద్దరు పిల్లలు

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్

మండలంలోని పాలపర్రుకు చెందిన దంపతులు అమెరికాలోని ఫినిక్స్ ప్రాంతంలో సరస్సు దాటుతుండగా గల్లంతయ్యారు. ఈ సమాచారం వారి కుటుంబాలకు అందడంతో తీవ్ర విషాదంలో మునిగిపోయారు. పాలప ర్రుకు చెందిన ముద్దన సుబ్బారావు వెంకట రత్నం దంపతులకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలున్నారు. కుమారుడు నారాయణకు 2010లో మండలంలోని అన్నపర్రుకు చెందిన హరితతో వివాహమైంది. 2012లో ఉద్యోగ నిమిత్తం మలేషియా వెళ్లారు. అక్కడే వారికి ఇద్దరు ఆడపిల్లలు పుట్టారు. 2016లో మలేషి యా నుండి అమెరికా వచ్చి అక్కడ ఆరిజోన్‌లో స్థిరపడ్డారు. ఈ క్రమంలో సోమవారం మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొనేందుకు నారాయణ కుటుంబం కారులో బయలుదేరింది. మార్గమధ్యలో ఫినిక్స్ ప్రాంతంలో ఓ ఐస్‌లేక్‌లో ఫొటోలు దిగేందుకు భార్యాభర్తలు కారు దిగి ముందుకు వెళు తుండగా గడ్డ కట్టిన ఐస్ గుంత వల్ల జారి సరస్సులో పడిపోయారు. సమీపంలో ఉన్నవా రు వెంటనే అధికారులకు విషయం తెలియజే యడంతో వారు గాలింపు చర్యలు చేపట్టారు. హరిత మృతదేహం లభ్యంకాగా నారాయణ ఆచూకీ తెలియలేదు. ప్రమాద సమయంలో పిల్లలిద్దరు కారు వద్దనే ఉండటంతో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. ఈ ఘటనతో పాలపర్రు, అన్నపర్రులో విషాద ఛాయలు అలముకున్నాయి.

బాపట్ల జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు తదితరులు

గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకు పొడిగించేందుకు

భూసేకరణ ప్రక్రియ ప్రారంభించాలి : ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు

- 5 లో

నాలుగో దశ వచ్చినా సన్నద్ధంగా ఉన్నాం

- జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి
- జిజిహెచ్‌లో మాక్‌డ్రిల్ - ఏర్పాట్లపై సమీక్ష
- ఐసియు బెడ్లు, ఆక్సిజన్ ప్లాంట్ల పరిశీలన

జిజిహెచ్‌లో పరిశీలిస్తున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి తదితరులు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

కరోనా నాలుగో దశ వచ్చినా ఏదుర్కొనేందుకు అన్ని చర్యలూ తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు సన్నాహాలపై గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్)లో మంగళవారం పర్యవేక్షించారు. ఆసుపత్రిలోని సదుపాయాలు, ఐసొలేషన్ పడకల సామర్థ్యం, ఐసియు, వెంటిలేటర్ పడకల సంఖ్యలపై సమీక్షంచారు. ఆక్సిజన్ ప్లాంట్ల పనితీరును పరిశీలించారు. కరోనా ఓపీ, బెడ్స్ గురించి ఆరా తీశారు. అనంతరం మీడియాతో కలెక్టర్ మాట్లాడుతూ కరోనా నాలుగో దశలో కేసులు వచ్చినా ఎదుర్కొనేందుకు పూర్తిస్థాయిలో సన్నద్ధమవుతున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మాక్ డ్రిల్ నిర్వహించామని, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి చర్చించామని తెలిపారు. రెండో వేవ్ సమయంలో ఆక్సిజన్ సమస్యలు ఎదుర య్యాయని, ఆ సమస్యలు

▸ 2లో

తెలంగాణ పోలీసుల అదుపులో కారంపూడి వాసి

నకిలీ మందులు సరఫరా చేస్తున్నాడనే అంశంపై సినీఫక్కీలో తరలింపు

ప్రజాశక్తి - కారెంపూడి

నకిలీ మందులు అమ్ముతున్నాడనే అంశంపై మండల కేంద్రమైన కారంపూడిలోని మెడికల్ షాపు నిర్వాహకుణ్ణి తెలంగాణ పోలీసులు సినీఫక్కీలో తీసుకెళ్లారు. మంగళవారం చోటుచేసుకున్న ఈ ఘటనపై వివరాల ప్రకారం.. పేరుమాల్ల వెంకటేష్ స్థానిక బస్టాండ్ సెంటర్లో శ్రీ ఆంజనేయ మందుల షాపును కొద్దికాలంగా నిర్వహిస్తున్నారు. అయితే తెలంగాణ రాష్ట్రానికి నకిలీ మందులను సరఫరా చేస్తున్నారనే అంశంపై తెలంగాణకు చెందిన కొందరు పోలీసులు కారంపూడికి మంగళవారం వచ్చారు. వెంకటేష్ దుకాణం వద్దకెళ్లి ఆయనతో మాట్లాడి వివరాలు సేకరించారు. అనంతరం వాహనంలో ఎక్కించుకుని వెళ్లిపోయారు. ఇదేమీ తెలియని స్థానికులు.. వెంకటేష్‌ను ఎవరో కిడ్నాప్

▸ 2లో

పింఛన్లు, కార్డుల తొలగింపు సరికాదు : సిపిఎం

ప్రజాశక్తి-తాడేపల్లి

వివిధ రకాల నిబంధనల పేరుతో సామాజిక పింఛన్లు, రేషన్ కార్డులు కుదించడం సరికాదని సిపిఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు, కార్యదర్శివర్గ సభ్యులు డి.శ్రీనివాసకుమారి, కొట్టె కరుణాకరరావు ఒక ప్రకటనలో ప్రభుత్వానికి హితవు పలికారు. అర్హులైన ప్రతిఒక్కరికీ పింఛన్లు, రేషన్ కార్డులు ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు. అనర్హులుంటే ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇళ్ల వెంట అధికారులు, సచివాలయ సిబ్బంది సర్వే పేరుతో వివిధ కారణాలు చూపుతూ పింఛన్లు, రేషన్ కార్డులు నిలిపివేస్తున్నామని చెప్పడంతో పేదవారు ఆందోళనకు గురవుతున్నారని చెప్పారు. పాలకవర్గాలు సంక్షేమ పథకాలు ఇచ్చే ముందే అర్హులు, అనర్హులు తెలియకుండా ఇస్తున్నారా అని ప్రశ్నించారు. వచ్చే పింఛను ఆగిపోతే సామాన్య పేదల పరిస్థితి ఏంటని, ప్రభుత్వం పునరాలోచించాలని కోరారు.

వెనక్కి తగ్గిన ప్రభుత్వం

సామాజిక పింఛన్లు, రేషన్ కార్డులు తగ్గిస్తామని ప్రభుత్వ అధికారులు నోటీసులు జారీ చేయడంతో పెద్దఎత్తున వ్యతిరేకత వ్యక్తమవుతుంది. ఈ నేపథ్యంలో మంగళవారం కలెక్టర్ జిల్లాలోని ప్రభుత్వ అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో పింఛన్లు, రేషన్ కార్డులు తగ్గిస్తారనే ప్రచారం ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తుందని, ఇప్పుడిస్తున్న వారికి ఎవ్వరికీ తగ్గించవద్దని ఆదేశాలు ఇచ్చినట్లు ఓ ప్రభుత్వ అధికారి తెలిపారు. నోటీసులు ఇచ్చినంత మాత్రాన పింఛన్లు, కార్డులు తగ్గించడం కాదని, రీవెరిఫికేషన్ మాత్రమే చేస్తున్నామని అధికారి చెప్పారు. అయితే ప్రభుత్వ సిబ్బంది మాత్రం రేషన్‌కార్డులు, పింఛన్లు తగ్గించే ప్రక్రియ యథావిధిగా ఆన్‌లైన్‌లో తమ పని తాము చేసుకెళ్తున్నారు. బాధితులు మంగళవారం కూడా కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూనే ఉన్నారు.

గుంటూరు పెయింట్ అసోసియేషన్ నూతన కమిటీ

ప్రజాశక్తి - గుంటూరు

గుంటూరు పెయింట్స్ డీలర్ అసోసియేషన్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం ఇటీవల గుంటూరులో జరిగింది. ఈ సందర్భంగా మంగళవారం డైరీని ఆవిష్కరించారు. పెయింట్ డీలర్స్, అన్ని పెయింట్ కంపెనీల ఆధ్వర్యంలో నిర్వహించిన నూతన కమిటీ ఎన్నికలో అధ్యక్షులుగా మహేష్, ఉపాధ్యక్షులుగా కామిరెడ్డి రామ కృష్ణా రెడ్డి, కార్యదర్శిగా శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. యాపిల్ వాళ్ పుట్టి (శ్రీ భార్గవ్ ఇండస్ట్రీస్ విజయవాడ) సేల్స్ మేనేజర్ కాపవరపు రామకష్ణ పాల్గొన్నారు. అన్ని పెయింట్ కంపెనీల సేల్స్ ఆఫీసర్లు పాల్గొని విజయవంతం చేశారు.

పింఛన్ల తొలగిచడం దారుణం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఎన్నికల ముందు అందరికి పింఛన్లు ఇస్తానని చెప్పిన సిఎం జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత దశల వారీగా పింఛనులను తొలగించడం దారుణమని టిడిపి నగర అధ్యక్షులు డేగల ప్రభాకర్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ ప్యామిలీ పొందుతున్న వారు, చిరుద్యోగులుగా పనిచేసి పిఎఫ్ పించనుపొందుతున్న వారి ఇంట్లో ఉన్న వికలాంగులు,వృద్దులకు కూడా పింఛన్లు రద్దు చేయడం దారుణం అన్నారు. ఎన్నికల్లో గెలిస్తే రూ.3 వేలు పింఛను ఇస్తానని చెప్పి నాలుగు ఏళ్లకు రూ.2750 చేస్తున్నట్టు ప్రకటించడం దారుణం అన్నారు. ఒక్కో సచివాలయంలో సగటున 10-50 మందికి పైగా పెన్షన్ దారులకు నోటీసులు ఇస్తున్నారని ఇందులో వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు,డప్పు కళాకారులే అధికంగా ఉన్నారని ఆయన తెలిపారు. ఒకే ఇంట్లో పెద్దసంఖ్యలో రాజకీయ పదవులు పొంది రూ.లక్షల్లో జీతం తీసుకుంటుండగా సామాన్యులకే ఆంక్షలు పెట్టడం శోచనీయం అన్నారు.

ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక

ప్రజాశక్తి - నూజెండ్ల

మండలంలోని 27 గ్రామ పంచాయతీలో జరిగిన ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి సామాజిక తనిఖీ ప్రజావేధికను మంగళవారం నూజెండ్ల మండల పరిషత్‌లో నిర్వహించారు. సోషల్ ఆడిట్ సిబ్బంది గత 15 రోజులుగా మండలంలోని గ్రామాలలో సామాజిక తనిఖీలు నిర్వహించి 13,14 రౌండ్స్‌కు సంబంధించి నివేదికలను జిల్లా ప్రాజెక్ట్ ఆఫీసర్ ముందు ఉంచారు. జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ గంగవరపు జోషప్ 25 గ్రామ పంచాయతీలలో ఆడిట్ నివేదికలు పరిశీలించారు. రెవెన్యూ ప్లాంటింగ్ మొక్కలు నాటిన 12600లకు గాను 5000 వేలు మొక్కలు బతికి ఉన్నాయని మిగిలినవి చనిపోయాయని తెలిపారు. చనిపోయిన మొక్కలు మరల తిరిగి నాటాల్సిందిగా ఆదేశించారు. హార్టికల్చర్ మొక్కలు కూడా చనిపోయిన, తీసేసిన రైతుల నుండి మరల 800 మొక్కలు నాటించాలి అన్నారు. మండలంలో 106000వేలు ఫిల్డ్ స్టాఫ్ పై రికవరీకి ఆదేశించారు. టీఎల పై గణాంకాలు తేడాతో 32000 వేలతో కలిపి మొత్తం 138000 వేలు రికవరీకి ఆదేశించారు. వర్క్ ఫైల్స్ 7 రిజిస్టర్స్‌లు పూర్తి స్థాయిలో ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలన్నారు. అదేవిధంగా పని ప్రదేశంలో నేమ్ బోర్డ్స్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి జయరామి రెడ్డి , ఎంపీడీఓ జిల్లాని బాషా, ఉపాధి హామీ పథకం ఏపీవో, టెక్నికల్ అసిస్టెంట్లు అన్ని పంచాయతీలకు సంబంధించిన ఫీల్డ్ అసిస్టెంట్లు ,సర్పంచులు, ఉపాది సిబ్బంది అన్ని గ్రామాల ప్రజలు పాల్గొన్నారు

రమేష్ హాస్పిటల్‌లో అరుదైన శస్త్రచికిత్స విజయవంతం

ప్రజాశక్తి-గుంటూరు

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న వైద్యులు

సుప్రమసివ్ స్ప్లెనొమాలజీ (బల్ల) వ్యాధితో బాధపడుతున్న 17 ఏళ్ల యువకుడికి రమేష్ హాస్పిటల్ వైద్యులు ల్యాప్రోస్కోపిక్ సుప్రమసివ్ స్ప్లెనెక్టమీ అనే ఆపరేషన్‌ను చిన్న కోతతో పూర్తి ల్యాప్రోస్కోపిక్ పద్ధతిలో విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వైద్య బృందం మాట్లాడుతూ ఈ యువకుడికి గతంలో ఓపెన్ హార్ట్ సర్జరీ, పల్మనరీ బలూన్ వాల్వోటమీ అనే అరుదైన ఆపరేషన్లు చేశారు. బల్ల అనేది కొన్ని వ్యాధులలో కన్పించే లక్షణం. నిజానికి ఇది ప్లీహం పరిమాణంలో పెద్దది కావడం వల్ల తెలుస్తుంది. సామాన్యంగా ప్లీహం కడుపులో ఎడమవైపు ఉదరవితానం క్రింద ఉంటుంది. చాలా రకాల వ్యాధులలో ప్లీహం పెద్దదౌతుంది. ఏవైనా రక్త కణాలు ఎక్కువగా వృద్ధిచెందినప్పుడు వాటిని నిర్మూలించడానికి ప్లీహం కూడా పెద్దదిగా మారాల్సి వుంటుంది. అలాంటప్పుడు దీనిని ఆయా వ్యాధుల లక్షణంగా భావిస్తారు. ఈ ప్లీహం అనేది సాధారణంగా 135 నుండి 175 గ్రాముల బరువు ఉంటుంది, ఈ యువకుడిలో ప్లీహం అనేది దానికి 12 రెట్లుగా అనగా 1710 గ్రాములుగా ఉంది.ఈ పరిమాణంలో పెద్దదై ఎక్కువగా పనిచేసినప్పుడు దానిని హైపర్ స్ప్లినిజం అంటారు. ఇందులో రక్తంలోని ఒకటి లేదా ఎక్కువ కణాలు తగ్గిపోతాయి, ఈ యువకుడిలో తెల్ల రక్త కణాలు డబ్ల్యూబిసి 2000, ప్లేట్‌లెట్స్ 79000, హిమోగ్లోబిన్ 7 గ్రాములు ఉంది దీనిని సరిచేయడానికి ప్లీహాన్ని తొలగించాల్సి ఉంటుంది. ఈ శస్త్రచికిత్సను స్ప్లినెక్టమీ అంటారు. ఈ ఇబ్బందితో ఆ యువకుడు హైదరాబాద్, విజయవాడలో ప్రముఖ హాస్పిటల్స్‌లో చికిత్స తీసుకొనగా వారు లాప్రోస్కోపిక్ కుదరదు అని ఓపెన్ మాత్రమే చేయడానికి వీలవుతుందని చెప్పారని ఆ యువకుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో రమేష్ హాస్పిటల్స్ వైద్య బృందం జనరల్,లాప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ బడిపాటి రాజు, డాక్టర్ శ్రీకర్ ఇనుగంటి ఇంటర్వెషనల్ రేడియాలజిస్ట్, డాక్టర్ బికాస్ సాహు మత్తు వైద్య నిపుణులు , రమేష్ హాస్పిటల్స్ బిజినెస్ హెడ్ డాక్టర్ వై కార్తీక్ చౌదరి, డాక్టర్ లక్ష్మి, డాక్టర్ భార్గవిలు రోగి యొక్క వివరాలను వెల్లడించారు. డిప్యూటీ మేనజింగ్ డైరెక్టర్ డాక్టర్ రాయపాటి మమత వైద్య బృందాన్ని అభినందించారు.

పింఛనుకు ఎసరు

(మొదటి పేజీ తరువాయి)

కార్డులను తొలగిస్తున్నారు. కార్డును పెండింగ్‌లో పెట్టి పింఛనును నిలుపుదల చేసే ప్రక్రియ గత కొంత కాలంగా కొనసాగుతోంది. తాడికొండలో అక్కెనప్రగడ సత్యవతి అనే వికలాంగురాలి తల్లి ప్రభుత్వ పింఛనుదారునిగా ఉండటం వల్ల పింఛను నిలిపివేశారు. నాలుగు చక్రాల గూడ్సు వాహనం ఉందని కూడా శారద అనే మరో వికలాంగురాలికి కూడా నోటీసులు జారీ చేశారు. ప్రతి సచివాలయం పరిధిలో 10 నుంచి20 మందికి నోటీసులు జారీ చేశారు. ప్రధానంగా సాంకేతిక తప్పిదాల వల్ల వేలాదిమందికి నష్టం జరగ్గా ఆరెంచెల నిబంధనలతో 20 వేల కుటుంబాల్లో సంక్షోభం ఏర్పడింది. గుంటూరు జిల్లాలో 2,49,825 మంది, పల్నాడు జిల్లాలో 2,63,777 మంది, రెండు జిల్లాల్లో కలిపి 5,13,602 మంది పింఛనుదార్లున్నారు. డిసెంబరులో పింఛను తీసుకున్నవారందరికీ జనవరిలో పింఛను ఇస్తారని నోటీసులపై పింఛనుదారులు ఇచ్చే వివరణ పరిశీలించిన తరువాత జనవరిలో తుది నిర్ణయం తీసుకుంటామని అధికారులు తెలిపారు.

నాలుగో దశ వచ్చినా సన్నద్ధంగా ఉన్నాం

(మొదటి పేజీ తరువాయి)

తలెత్తకుండా ఆక్సిజన్ ప్లాంట్లు 10 కెయల్, 20 కెయల్, పిఎం కేర్ ప్లాంట్లనూ సిద్ధం చేశామని వివరించారు. మెడికల్ కళాశాలలో విడిఆర్ఎల్ ల్యాబ్‌లో కరోనా పరీక్షలు చేస్తున్నామని, తెనాలిలో కూడా త్వరలో ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. పండుగ సీజన్‌లు రావాడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ప్రజలు వ్యక్తిగతంగా భౌతిక దూరం పాటించాలని, మాస్కులు ధరించాలని సూచించారు. విదేశాల నుంచి వచ్చిన వారికి ప్రత్యేక స్క్రీనింగ్‌లు చేస్తామన్నారు. విదేశీ ప్రయాణికులు ఇళ్లకు వచ్చిన తర్వాత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సిబ్బంది వైద్య సహాయం అందిస్తామని చెప్పారు. ప్రస్తుతానికి ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని, జిల్లాలో ఎక్కడా కోవిడ్ కేసులు నమోదు కాలేదని చెప్పారు. సమీక్షలో జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ సుమయఖాన్, జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్.ప్రభావతి, సివిల్ సర్జన్ ఆర్ఎంఒ డాక్టర్ సతీష్ కుమార్, నర్సింగ్ సూపరిం టెండెంట్ షమీనా బేగం, కిరణ్మయి అడ్మినిస్ట్రేటర్ బి.ప్రవీణ్ కుమార్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ పద్మావతిదేవి పాల్గొన్నారు.

మెటీరియల్‌ను అందజేస్తున్న పౌండేషన్ సభ్యులు

విద్యార్థులకు గంగినేని ఫౌండేషన్ స్టడీ మెటీరియల్

ప్రజాశక్తి - నూజెండ్ల

మండలంలోని ములకలూరు జెడ్‌పి పాఠశాలలోని 38 మంది 10వ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను గంగినేని ఫౌండేషన్ ద్వారా గంగినేని రాఘవ ఆధ్వర్యంలో మంగళవారం అందించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ ఎంపిపి ఎ.వెంకట్రావు మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని, తల్లిదండ్రులు, పాఠశాల, ఊరికి మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. ఫౌండేషన్ చైర్మన్ రాఘవ మాట్లాడుతూ పాఠశాలలోని ఎక్కువమంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించాలని శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీలత దేవి, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ సురాబత్తిన వీరయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డైరీ , కోర్ట్ క్యాలెండర్ లను ఆవిష్కరిస్తు న్యాయవాదులు

ఐఎల్ కేలండర్, డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో 2023 కోర్టు డైరీ, కేలండర్‌ను స్థానిక కోర్టు ప్రాంగణంలో నిన్యాయ దేవత విగ్రహం వద్ద బార్ అసోసియేషన్ అధ్యక్షులు మారురి లింగారెడ్డి మంగళవారం ఆవిష్కరించారు. ఎన్.వేణుగోపాల్, కె.వీరభాస్కర్‌రెడ్డి, సిహెచ్.విజయభాస్కర్‌రెడ్డి, కె.వెంకటేశ్వరరావు, డి.శ్రీనివాస్, జె.శేషయ్య, జి.అజయ్, బాబురావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న క్లబ్ సభ్యులు

పేదలకు లైన్స్‌క్లబ్ దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి - మాచర్ల

లైన్స్‌క్లబ్ మాచర్ల శాఖ ఆధ్వర్యంలో స్థానిక చెన్నకేశవ నగర్ కాలనీలోని పేదలకు మంగళవారం దుప్పట్లు పంపిణీ చేశారు. ప్రజా సేవలో, వారి ఇబ్బందులను తొలగించడంలో లైన్స్ క్లబ్ ముందు పీఠిన ఉంటుందని సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ సీనియర్ నాయకులు చుండూరు వెంకటేశ్వర్లు, వ్యవసాయ శాఖ సలహా మండలి పల్నాడు జిల్లా చైర్మన్ కె.సాయిమార్కొండారెడ్డి పాల్గొన్నారు.

తెలంగాణ పోలీసుల అదుపులో కారంపూడి వాసి

(మొదటి పేజీ తరువాయి)

చేశారనుకుని ఉలిక్కిపడ్డారు. ఈ విషయం తెలిసిన వెంకటేశ్ తండ్రి శేషు, స్నేహితుడు మల్లికార్జున్‌రావు.. వెంకటేష్‌ను పోలీసులు తీసుకెళ్తున్న వాహనాన్ని వెంబడించారు. వరంగల్ వెళ్లిన తర్వాత నకిలీ మందుల అంశం తెలిసింది. అయితే దీనిపై తమకు సమాచారం లేదని, వెంకటేష్ వివరాలూ పూర్తిగా తెలియవని కారంపూడి సిఐ డి.విజయ్‌కుమార్ చెప్పారు.

నేరాల నియంత్రణకు చర్యలు

- ట్రాఫిక్ నియంత్రణకు 32 సీసీ కెమెరాలు ఏర్పాటు
- పరివర్తన రాకుంటే రౌడీషీట్ ఓపెన్
- జిల్లా ఎస్పి రవిశంకర్ రెడ్డి

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పి రవిశంకర్‌రెడ్డి

ప్రజాశక్తి-వినుకొండ

నేరాల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని, నేర ప్రబుదుల్లో పరివర్తన రాకపోతే బైండెవర్లు, రౌడీషీట్లు ఓపెన్ చేసి కఠిన చర్యలు తీసుకుంటామని పల్నాడు జిల్లా ఎస్పి రవిశంకర్ రెడ్డి తెలిపారు. వార్షిక తనిఖీల్లో భాగంగా మంగళవారం వినుకొండ టౌన్, సర్కిల్ పోలీస్ స్టేషన్లో రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ చోరీల కేసుల్లో ప్రాపర్టీ రికవరీ చేస్తున్నామని తెలిపారు. ప్రజలు ప్రశాంతంగా ఉండేందుకు, నేరాల నియంత్రణకు పనిచేస్తున్నామని, దీనిలో భాగంగా అనుమానితులను, నేరస్తులను గుర్తించి పిడి యాక్ట్, బైండోవర్ కేసులు నమోదు చేసి నేరాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వివిధ చోరీ కేసుల్లో బంగారం రికవరీ చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. వినుకొండ పట్టణంలో 32 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందని, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపడుతున్నామన్నారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు ఒక ఎస్సై నియమించడం జరుగుతుందన్నారు. అలాగే డిగ్రీ ,ఇంజనీరింగ్, బిఈడి కళాశాలల విద్యార్థులతో పాటు ఎన్‌సిసి, స్కౌట్ విద్యార్థులతో స్వచ్ఛందంగా ట్రాఫిక్ నియంత్రణకు సహాయం తీసుకుంటామని వివరించారు. మాచర్లలో జరిగిన సంఘటన పై పోలీసులు వెంటనే స్పందించి అదుపులోకి తెచ్చామని, అక్కడ ఫ్యాక్షన్ గొడవల వల్ల విధ్వంసం చోటుచేసుకుందన్నారు. పల్నాడులో ఫ్యాక్షన్ అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకుంటున్నామని హెచ్చరించారు. సమావేశంలో నరసరావుపేట డిఎస్‌పి విజయ్ భాస్కర్, పట్టణ సీఐ అశోక్ బాబు ఉన్నారు.

రేషన్ షాప్‌లు తనిఖీ

ప్రజాశక్తి- తెనాలి

పట్టణంలోని నెంబరు 0787025 రేషన్ షాపును మహిళా శిశు అభివృద్ధి సంస్థ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ బి.మనోరంజని మంగళవారం తనిఖీ చేశారు. ఆజాదిక అమత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా 5 వేల ఫెయిర్ ప్రైస్ షాపులను తనిఖీ చేయాలన్న ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు రేషన్ షాపులను తనిఖీ చేస్తున్నట్లు ఆమె చెప్పారు. షాపులో సరుకు నిల్వ, రికార్డులలో లెక్కలు అన్ని సక్రమంగా ఉన్నట్లు ఆమె తెలిపారు. ఆమె వెంట సివిల్ సప్లైస్ డిప్యూటీ తహశీల్దార్ మూర్తి ఉన్నారు.

ప్రజాశక్తి- మేడికొండూరు

మండల పరిధిలోని మేడికొండూరు వెలవర్తిపాడు రోడ్డులో గల దివ్య మహిళా గ్రూప్ రేషన్ షాపును కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, తహశీల్దార్ కరుణ్ కుమార్ ఆదేశాల మేరకు మేడికొండూరు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బందెర భాస్కర్ మంగళవారం తనిఖీ చేశారు.సాధారణ తనిఖీలలో భాగంగా ఈ తనిఖీలు నిర్వహించినట్లు భాస్కర్ తెలిపారు. మొత్తం కార్డులు సంఖ్య, బియ్యం నిల్వలు, పంపిణీ పూర్తిస్థాయి రికార్డులను పరిశీలించారు. తనిఖీలలో ఎటువంటి అవకతవకలు జరగలేదని ఆర్ఐ తెలిపారు.

తెనాలిలో తనిఖీ చేస్తున్న ఐ సిడిఎస్ పిడి మనోరంజని

మేడికొండూరులో రికార్డులను తనిఖీ చేస్తున్న ఆర్ఐ భాస్కం

మిర్చి నిల్వలు

		బ్యాగులు
మిర్చి దిగుమతి	:	32,603
మిర్చి ఎగుమతి	:	32,193
మిర్చి నిల్వ	:	10,931

మిర్చి ధరలు

	రూపాయలలో
334	10000 - 26000
నెం.5	15000 - 24000
273	16000 - 23000
341	10000 - 26000
4884	16000 - 18000
నాన్ ఎసి	
తేజ	9000 - 23000
బడిగి	9000 - 27500
దేవనూరు డీలక్స్	10000 - 23500
తాలుకాయలు	5,000 - 13,500
	ఎసి
334	17500 - 24500
341	16500 - 18800
సూపర్ -10	22000 -24000
తేజ	11500 - 20000
బడిగి	19000 - 27000
దేవనూర్ డీలక్స్	17000 - 19000
తాలుకాయలు	5000 - 10,500

దుప్పట్లు పంపిణీ చేస్తున్న డాక్టర్‌టి.రాజారావు, మాధవి

వికలాంగులకు ప్రతి ఒక్కరూ సహకరించాలి

ప్రజాశక్తి -పొన్నూరు రూరల్

వికలాంగులకు ప్రతి ఒక్కరూ సేవ చేసి సహకరించాలని డాక్టర్ టి. రాజారావు అన్నారు. మంగళవారం వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో 63వ అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని పురస్కరించుకోని వికలాంగులకు దుప్పట్లు పంపిణీ, అభినందన సభ కార్యక్రమాన్ని స్థానిక డాన్‌బాస్కోలో నిర్వహించారు. కార్యక్రమానికి విహెచ్‌పిఎస్ జాతీయ అధ్యక్షురాలు కొల్లి మాధవి అధ్యక్షత వహించారు. రాజారావు మాట్లాడుతూ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వికలాంగులకు సేవ చేయాలని అన్నారు. వికలాంగులు ఎవరికి తీసిపోరని అందరితో సమాన హక్కులు పొందుతూ అన్ని రంగాలలో వారు ముందుకు సాగుతున్నారని తెలిపారు. అధ్యక్షురాలు కొల్లి మాధవి మాట్లాడుతూ వికలాంగుల సంక్షేమం కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేయాలని వారికి ప్రత్యేక నిధులను కేటాయించాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి వికలాంగులకు పంపిణీ చేశారు. 200 మంది వికలాంగులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టి. రామారావు కే ఎన్ పి ఎస్ శ్రీనివాస్, రామకష్ణ వెలుగు శివప్రసాద్, బండారు దుర్గారావు, ఆదిశేషు, కంది వెంకట్ రెడ్డి, విజయ్ కుమార్, అంకమ్మరావు, అల్లా బక్షు, ఎలమందరావు, కిరణ్, చంద్రకుమార్, పల్లపు ఏసు, జో జి బాబు, నాగూర్ బి.హనీ, నన్ని, వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అల్లూరి జయహే కార్యక్రమం

ప్రజాశక్తి -పెదనందిపాడు రూరల్

రోటరీ క్లబ్ ఆఫ్ పెదనందిపాడు వారి ఆధ్వర్యంలో లైన్స్ మాంటిస్సోరి హైస్కూలు, నారాయణ హై స్కూల్‌లో చిలకలూరిపేట రోటరీ క్లబ్ సభ్యులు విశ్రాంత ప్రిన్సిపాల్ తోటకూర వెంకటనారాయణ మంగళవారం "అల్లూరి జయహే" కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట నారాయణ అల్లూరి సీత రామరాజు 125వ జన్మదిన ఉత్సవాలలో భాగంగా ఆయన స్వాతంత్ర పోరాట పటిమను గూర్చి వివరించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ పోపూరి నాగేశ్వరరావు, స్థానిక క్లబ్ అధ్యక్షులు కారసాల విక్టర్ జాన్ పాల్, పారిశ్రామికవేత్త ముద్దన రాఘవయ్య, నల్లూరి వీరబ్రంహ్మాయ్య , పోపూరి వేణు, ఆయా పాఠశాలల యాజమాన్య సభ్యులు పాల్గొన్నారు. అనంతరం రోటరీ క్లబ్ సభ్యులు టీవీ నారాయణను ఘనంగా సత్కరించారు.

టి.వి.నారాయణ ను సత్కరిస్తున్న క్లబ్ సభ్యులు

రేపు వాహనాలకు వేలం పాట

ప్రజాశక్తి-విజయపురిసౌత్

పల్నాడు జిల్లా ఎస్ఈబీ ఉత్తర్వుల మేరకు వివిధ కేసులలో సీజ్ చేసిన 5 వాహనాలను ఈ నెల 29వ తేది నాగార్జునసాగర్ పోలీస్ స్టేషన్‌లో బహిరంగంగా వేలం పాట వేయనున్నట్లు ఎస్ఐ పి అనిల్ కుమామార్ రెడ్డి మంగళవారం తెలిపారు. వేలం పాటలో రెండు బొలోరో లారీలు, బజాజ్ ఆటో, మారుతి 800 కారు, బజాజ్ పల్సర్ బైక్ వాహనాలు ఉన్నాయన్నారు. వాహనాలు కొనుగోలు చేయదలిచిన వారు ఆదే రోజు ఉదయం 10గంటలకు జరిగే వేలం పాటలో పాల్గొనాలని కోరారు.

నందివెలుగులో బిఎల్‌ఓల వద్ద వివరాలు సేకరిస్తున్న అధికారులు

పోలింగ్ స్టేషన్లు పరిశీలన

ప్రజాశక్తి-తెనాలి

ఎన్నికల సంఘం పరిశీలకులు, ఐఏఎస్ అధికారి శేషగిరి మంగళవారం రూరల్ గ్రామం నందివెలుగులో పర్యటించారు. గ్రామంలోని 17, 18 పోలింగ్ స్టేషన్లను సందర్శించారు. పోలింగ్ బూత్‌కు సంబందించి బిఎల్‌ఓలు చేస్తున్న ఓటరు జాబితా మార్పులు, చేర్పులు, కొత్త ఓటరు నమోదు ప్రక్రియను తహశీల్దార్ కె.రవిబాబు ద్వారా తెలుసుకున్నారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పోలింగ్ బూత్‌ల సిబ్బంది ఉన్నారు

షాపుల బహిరంగ వేలం

ప్రజాశక్తి- తెనాలి

స్థానిక బోస్ రోడ్ లోని కాకుమాను శంకరుని ధర్మసత్రం పరిధిలో గల 12,14 నెంబర్ల షాపుల బహిరంగ వేలం ఈనెల 29న ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు సత్రం కార్య నిర్వహణాధికారి మండేపూడి పానకాలరావు మంగళవారం తెలిపారు. మూడేళ్ల కాల పరిమితికి అద్దె ప్రాతిపదికన జరిగే వేలంలో ఆసక్తిగల వారు పాల్గొనాల్సిందిగా ఆయన కోరారు.

యు/ఓ21, రూల్ 54 (1ఎ) సిపిసి నోటీస్

అద్దంకి సీనియర్ సివిల్ జడ్జ్ వారి కోర్టులో

ఇపి:59/2019

ఓ.ఎస్:60/2011

బిట్వీన్

అడ్డగడ వెంకటసుబ్బయ్య ..డిహెచ్‌ఆర్

వర్సెస్

రావుల అంజనీ దేవి మరియు వగైరాలు .. జెడిఆర్

పైన తెలిపిన ఈపీ లో మీరు జెడిఆర్ నెం 1,2 గా ఉన్నారు. కానీ కోర్టు వారు పలు పర్యాయములు కోర్టు ప్రాసెస్ ద్వారా మరియు పోస్ట్ ద్వారా పంపించి ఉన్నారు. కానీ మీరు కాలయాపన చేస్తున్నందున పేపర్ పబ్లికేషన్ ద్వారా తెలియ జేయడమైనది. కావున మీరు 03-01-2023వ తేదీ ఉదయం 10:30 కు మీరు కానీ మీ ద్వారా వకీలు కానీ హాజరు కావలసినది. లేనియెడల మీ మీద పరోక్షముగా తీర్పు చెప్పగలరు. ఇందుమూలముగా తెలియజేయడమైనది.

వాయిదా తేది :03-01-2023 ఇట్లు

తమ విధేయులు

గూడాల అంజిరెడ్డి

డిహెచ్‌ఆర్ తరపున అడ్వకేట్

అద్దంకి

పిడుగురాళ్ళ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు: పిడుగురాళ్ళ

ఈ.పి.1/2019 ఇన్ ఓ.యస్. 4/2011

బిట్వీన్:

మరదాన విజయ కుమారి ...డి.హెచ్.ఆర్

మరియు

1.వేముల వెంకయ్య

2.వేముల పిచ్చయ్య

3.వేముల రామమూర్తి ...జె.డి.ఆర్స్

మా క్లైంటు పైన నెంబర్ ఈ.పిలో డి.హెచ్.ఆర్ అయినందున పై నెంబర్ ఈ.పిలో 1.వేముల వెంకయ్య(డైడ్) 2.వేముల పిచ్చయ్య 3.వేముల రామమూర్తి మా క్లైంటు కోర్టుద్వారా మీకు అనేక మారులు నోటీసులు పంపించియున్నారు. కాని మీరు కావాలనే కోర్టు నుండి వచ్చిన నోటీసులను తీసుకోవడం లేదు. కనుక కోర్టు వారు ప్రత్యామ్నాయ సర్వీసు కింద పేపర్ పబ్లికేషన్స్ కి ఇమ్మని మీరు నోటీసు తీసుకొని వెంటనే మీరు కాని మీ తరపు లాయరు కాని అటెండ్ అయి ది.29-12-2022 మీ ఆక్షేపణలు తెలియజేయగలరు. లేనియెడల మీ పరోక్షమున వాయిదా రోజు తీర్మానించగలరు శ్రీ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టువారు.

ఇట్లు

తేది:27-12-2022, డి.హెచ్.ఆర్ అడ్వకేట్

పిడుగురాళ్ళ

పి.మాణిక్యం,

అడ్వకేట్,

పిడుగురాళ్ళ,

8106929035.

కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న వి.వెంకటేశ్వర్లు తదితరులు

వార్తాపత్రికలు నడుస్తున్న గ్రంథాలయాలు

ప్రజాశక్తి కేలండర్ ఆవిష్కరణలో ఆపిల్ ఐఐటి స్కూల్స్ చైర్మన్ వి.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - మాచర్ల

వార్తాపత్రికలు నడుస్తున్న గ్రంథాలయాలని ఆపిల్ ఐఐటి స్కూల్స్ చైర్మన్ వి.వెంకటేశ్వర్లు అన్నారు. పాఠశాల ఆవరణలో ప్రజాశక్తి 2023 కేలండర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమానికి జనవిజ్ఞాన వేదిక పల్నాడు జిల్లా గౌరవాధ్యక్షులు కె.ఆదినారాయణ అధ్యక్షత వహించగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పత్రికలు విశ్వసనీయత కోల్పోకూడదని, ఎన్ని ఇబ్బందులు ఎదురైనా వాస్తవాలను ప్రజల ముందు ఉంచాలని చెప్పారు. అప్పుడే ప్రజాస్వామ్యం పునాదులు పటిష్టంగా ఉంటాయన్నారు. ప్రజాశక్తి విలువలతో కూడిన పత్రిక అని, అభ్యుదయ భావాలతో కొనసాగే ఈ పత్రికను ప్రజలంతా ఆదరించాలని కోరారు. కె.ఆదినారాయణ తాను 30 ఏళ్ల నుండి ప్రజాశక్తిని చదువుతూ ఎన్నో విషయాలు నేర్చుకున్నానని, వాటిని విద్యార్థులకు, ఇతర ప్రజలకు అందిస్తున్నానని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రాజు, సాయి, ప్రజాశక్తి పల్నాడు డివిజన్ ఇన్‌ఛార్జి ఎన్.కృష్ణ, విలేకర్లు, యు.రమేష్, యు.ప్రసాద్ పాల్గొన్నారు.

యుటిఎఫ్ కేలండర్, డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి - దాచేపల్లి

మండలంలోని నారాయణపురం యుటిఎఫ్ కార్యాలయంలో యుటిఎఫ్ కేలండర్, డైరీని నాయకులు మంగళవారం ఆవిష్కరించారు. జిల్లా కార్యదర్శి వి.నాగేశ్వరరావు, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శి సుదర్శన్ ఆనంద్ కుమార్, సత్యానందరావు, యేషయ్య, మస్తాన్‌వలి, స్వాములు, పప్పుల రాజా, శ్రీనివాసరావు పాల్గొన్నారు

విద్యార్థులకు ట్యాబ్‌లు అందిస్తున్న మంత్రి అంబటి రాంబాబు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

రాజుపాలెం విద్యార్థులకు ట్యాబ్‌లు

ప్రజాశక్తి - రాజుపాలెం

మండల కేంద్రమైన రాజుపాలెంలోని జెడ్‌పి పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లోనే విద్యారంగానికి ప్రభుత్వం అధికంగా కేటాయిస్తోందని చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను విద్యార్థులు ఉపయోగించుకోవాలని, అందరూ తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పాలని కోరారు. ఇందుకు ఉపాధ్యాయులూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపిపి టి.రాజేశ్వరి, వైసిపి రాష్ట్ర కార్యదర్శి ఎన్.రాజనారాయణ, ఎంపిటిసి బి.సాంబశివరావు, సర్పంచ్ పి.అశోక్, హెచ్‌ఎం అరుణశ్రీ పాల్గొన్నారు.

అర్హుల పింఛన్లు తొలగించడం లేదు

- వైద్యారోగ్య శాఖ మంత్రి విడదల రజిని
- ప్రభుత్వ నిబంధనల ప్రకారమే అనర్హుల గుర్తింపు : పల్నాడు కలెక్టర్

ప్రజాశక్తి - చిలకలూరిపేట

అర్హులెవరికీ నష్టం జరగకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం ద్వై వార్షిక నగదు పంపిణీని చేస్తోందని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి విడదల రజిని అన్నారు. ఈ కార్యక్రమాన్ని తాడేపల్లిలోని సిఎం క్యాంపు కార్యాలయం నుండి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం ప్రారంభించగా స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో మంత్రితోపాటు పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చిలకలూరిపేట మున్సిపల్ పరిధిలోనే 400 మందికి నూతనంగా పింఛన్లు మంజూరయ్యాయని, వీరికి జనవరి నుండి రూ.2,750 పింఛను అందుతుందని చెప్పారు. పింఛన్లు తీసేస్తున్నారనే ప్రచారాన్ని ఎవరూ నమ్మొద్దని కోరారు. కలెక్టర్ మాట్లాడుతూ గతంలో సాంకేతిక సమస్యల వల్ల అర్హత కోల్పోయిన వారికి వాటిని సరిచేసి పింఛను మంజూరు చేశామన్నారు.

సభలో మాట్లాడుతున్న మంత్రి విడదల రజిని

పల్నాడు జిల్లాలో 5640 మందికి మంజూరైందని తెలిపారు. ఏ పథకాలకైనా అర్హతుండి లబ్ధి చేకూరకుంటే వారినీ గుర్తించి పథకాలు వర్తింపజేస్తామన్నారు. పింఛన్లను ప్రతి ఆరు నెలలకు ఒకసారి సామాజిక తనిఖీ చేసి అర్హతున్న వారికి మంజూరు చేస్తామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ నిబంధన మేరకు వెయ్యి చదరపు గజాల స్థలం ఉన్న వారిని, 300 వాట్ల విద్యుత్ వినియోగం చేసుకునే వారిని అనర్హులుగా తెలిపారు. అనంతరం జిల్లాకు సంబంధించి 5640 మందికి రూ.9 కోట్లకుపైగా చెక్కులను లబ్ధిదార్లకు అందించారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 2021 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి పంటల బీమా కింద 476 రైతులకు రూ.1.25 కోట్ల చెక్కును అందించారు. అదేవిధంగా గ్రామీణ అభివృద్ధి సంస్థ తరపున వైఎస్ఆర్ పెన్షన్ కానుక, 1639 గ్రూపులకు సంబంధించి భారీ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ శేషిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ రఫాని, కమిషనర్ గోవిందరావు, గ్రామ వార్డు సచివాలయం అధికారి మహాలక్ష్మి, డిఆర్‌డిఎ పీడీ బాలు నాయక్, వ్యవసాయ శాఖ అధికారి ఐ.మురళి, తహశీల్దార్ సుజాత పాల్గొన్నారు.

ఇదిలా ఉండగా పట్టణంలోని మద్దినగర్ 4వ లైన్‌కు చెందిన సయ్యద్ కుమ్రుద్ పింఛను తొలగింపు నేపథ్యంలో ఆమెను కలెక్టర్ వెళ్లి కలిశారు. 1554 చదరపు అడుగుల స్థలం ఉందని, అందుకే పింఛను నిలిపేశామని చెప్పారు. అయితే తన కుమారునికి ఆరోగ్యం సరిగా లేదని, డయాలసిస్ జరుగుతోందని, ఆదుకోవాలని ఆమె కోరారు. డయాలసిస్ పేషెంట్‌కు పింఛను అందేలా చూడాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. కుటుంబంలో ఒక్కరికే పింఛను వస్తుందన్నారు.

నాలుగు గ్రామాల రైతులకు భూ హక్కు పత్రాలు

మండలంలోని వేలూరు, చినపసుమర్రు, కంఠేటివారికండ్రిక, మనుకొండవారిపాలెం గ్రామాలకు చెందిన రైతులకు భూ హక్కు పత్రాలను అందించారు. భూ రీసర్వే అనంతరం పత్రాలను స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కలెక్టర్ ఎల్.శివశంకర్ అందించారు. త్వరలోనే అన్ని గ్రామ రైతులకూ పంపిణీ చేస్తామన్నారు.

సిపిఎం సీనియర్ సభ్యులు పారెళ్ల సాంబయ్య మృతి

ప్రజాశక్తి - యడ్లపాడు

పారెళ్ల సాంబయ్య అంతిమ యాత్ర.. ఇన్‌సెట్‌లో సాంబయ్య (ఫైల్)

మండలంలోని లింగారావుపాలేనికి చెందిన సిపిఎం సీనియర్ సభ్యులు, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు పారెళ్ల సాంబయ్య (67) సోమవారం రాత్రి గుండెపోటుతో మరణించారు. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. సాంబయ్య 1983 నుండి సిపిఎం సభ్యునిగా కొనసాగుతున్నారు. 40 ఏళ్లుగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యునిగానూ ఉన్నారు. యడ్లపాడులో ఇటీవల నిర్వహించిన వ్యవసాయ కార్మిక సంఘం మండల మహాసభలో అధ్యక్షునిగా ఎన్నియ్యారు. సాంబయ్య మరణ వార్త తెలుసుకున్న సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు ఆయన భౌతికాకాయాన్ని సందర్శించి ఎర్ర జెండా కప్పి నివాళులర్పించారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం అంతిమ యాత్ర నిర్వహించి అంత్యక్రియలు పూర్తి చేశారు. తొలుత నిర్వహించిన సంతాప సభకు వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు కె.రోశయ్య అధ్యక్షత వహించారు. కౌలురైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి ఎ.లక్ష్మీశ్వరరెడ్డి, సిపిఎం నాయకులు ఎన్.కాళిదాసు మాట్లాడుతూ సాంబయ్య మృతి సిపిఎం, ప్రజా సంఘాలకు తీరనిలోటన్నారు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారని, పేదల సమస్యల పరిష్కారం కోసం జరిగిన ఎన్నో పోరాటాల్లో కీలకంగా ఉన్నారని చెప్పారు. సిపిఎం అభ్యున్నతి కోసం నిత్యం పాటుపడేవారన్నారు. కరోనా కాలంలో యడ్లపాడులో సిపిఎం నిర్వహించిన ఐసోలేషన్ కేంద్రంలో 45 రోజులపాటు సాంబయ్య, ఆయన భార్య ఇద్దరూ వంట చేశారని, పేదల పట్ల వారికున్న నిబద్ధతకు అదే నిదర్శనమని గుర్తు చేసుకున్నారు. నివాళులర్పించి సంతాపం తెలిపిన వారిలో సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు ఎన్.భావన్నారాయణ, టి.కోటేశ్వరరావు, పి.వెంకటేశ్వర్లు, టి.ప్రతాపరెడ్డి, జి.హరిబాబు, ఎన్.నాగేశ్వరరావు, కె.నాగేశ్వరరావు, పి.సుబ్బారావు, జి.విజయ్‌కుమార్, ఎస్.ఆంజనేయులు నాయక్, గోపాలరావు, కె.హనుమంతరెడ్డి, డి.శికుమారి, కె.రామారావు, ఎం.రామారావు, పద్మారావు, గురుస్వామి, కె.నాగేశ్వరరావు, షేక్ మస్తాన్‌వలి ఉన్నారు.

దేశం గర్వించదగ్గ పారిశ్రామిక వేత్త వెలగపూడి లక్ష్మణ్‌దత్తు

జయంతి ఉత్సవాల్లో కెసిపి సిమెంట్స్ జనరల్ మేనేజర్ బివిపిఎస్ చౌదరి

ప్రజాశక్తి - మాచర్ల

భారతదేశం గర్వించదగ్గ పారిశ్రామిక వేత్త వెలగపూడి లక్ష్మణ్‌దత్తు అని కెసిపి సిమెంట్ ఫ్యాక్టరీ సీనియర్ జనరల్ మేనేజర్ బివిపిఎస్ చౌదరి అన్నారు. లక్ష్మణ్‌దత్తు జయంతి ఉత్సవాలను కెసిపి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. ఈ రోజును సంస్థ నాణ్యతాదినోత్సవంగా క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నట్లు సీనియర్ జనరల్ మేనేజర్ బివిపిఎస్ చౌదరి అన్నారు. లక్ష్మణ్‌దత్తు ఉన్నత విద్యావంతులే కాకుండా మేథో సంపన్నులని కొనియాడారు. కెసిపి సంస్థలు ఆయన సారథ్యంలో ఉన్నత స్థానాలకు ఎదిగినట్లు చెప్పారు. ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని ఆయా సంస్థలలో అమలు చేయటం లక్ష్మణ్‌దత్తు ప్రత్యేకతన్నారు. పోటీ ప్రపంచంలో తక్కువ శ్రమశక్తితో ఎక్కువ ఉత్పత్తితో నాణ్యమైన దిగుబడులు సాధించేందుకు ఆయన చేసిన కృషి సత్ఫలితాలు ఇచ్చిందని, ఆయన వేసిన మార్గంలో, నూతన ఆలోచనలతో చేసే పనిలో మెరుగైన ఫలితాలను సాధించేందుకు కృషి చేద్దామని చెప్పారు. కార్యక్రమంలో కెసిపి సంస్థ అధికారులు డిజిఎం ఆనందరెడ్డి, హెచ్‌ఆర్ అండ్ ఎస్ మేనేజర్ ఎం.శ్రీనివాసరావు, అధికారులు రమణరావు, వెంకటేశ్వరరావు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు. అనంతరం సిబ్బందికి, వారి కుటుంబ సభ్యులకు అన్నదానంతోపాటు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

లక్ష్మణదత్తు చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పిస్తున్న కెసిపి జనరల్ మేనేజర్ బివిపిఎస్ చౌదరి, ఇతర ఉద్యోగులు

సైకిల్ పోలోలో అమూల్యకు 5వ ర్యాంకు

ప్రజాశక్తి-ఈపూరు

మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో ఇటీవల నిర్వహించిన సైకిల్ పోలో జాతీయ స్థాయి పోటీల్లో మండలంలోని ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థిని బండి అమూల్య బాలికల జూనియర్ విభాగంలో ఐదవ ర్యాంకు సాధించినట్లు ప్రిన్సిపాల్ పి.నిరంజన్ తెలిపారు. ఈ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ సైకిల్ పోలో అసోసియేషన్‌కు ప్రాతినిధ్యం వహించిన అమూల్య ప్రతిభ చూపడంపై అసోసియేషన్ సభ్యులు పి.అరవింద్, ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరావు, పిఇటి గోపి అభినందనలు తెలిపారు.

గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకు పొడిగించేందుకు

భూసేకరణ ప్రక్రియ ప్రారంభించాలి : ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి -బాపట్ల జిల్లా

గుంటూరు ఛానల్ ను పర్చూరు వరకు పొడిగించే ప్రక్రియలో భాగంగా పర్చూరు మండలంలో భూసేకరణ ప్రారంభించేందుకు నోటిఫికేషన్ ఇచ్చి ఇందుకు తగిన నిధులు కేటాయించి 50 గ్రామాల ప్రజలకు సాగునీరు, త్రాగునీరు అందించాలని కోరుతూ శాసనమండలి సభ్యులు కె ఎస్ లక్ష్మణరావు ఆధ్వర్యంలో రైతుల బృందం బాపట్ల జిల్లా కలెక్టరు విజయకృష్ణన్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాల లోని రైతులు, సామాన్య ప్రజలు సాగునీరు, తాగునీరు కోసం 85 సంవత్సరాల నుంచి పోరాడుతున్నారన్నారు. గుంటూరు ఛానల్ పొడిగింపు ద్వారా పర్చూరు, చిలకలూరిపేట, ఎడ్లపాడు, కాకుమాను,పెదనందిపాడు, ప్రత్తిపాడు మండలాల పరిధిలోని 49 గ్రామాలకు చెందిన 48 వేల ఎకరాలకు సాగునీరు, ప్రజలకు తాగునీరు లభిస్తాయన్నారు. దీర్ఘకాలంగా ఈ ప్రాంతం కరువులకు, వరదలకు ప్రసిద్ధి చెందినదని, పూర్తిగా వర్షాధారంపై ఆధారపడి వ్యవసాయాన్ని కొనసాగిస్తున్నారన్నారు, నల్లమడ వాగులో పట్టణ వ్యర్థాలు, మురుగునీరుతో, కలుషితమైన నీటితో సాగు చేయడం వల్ల పొలాలు చవుడుబారిపోతున్నాయని తెలిపారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా ఈ కాలువ పొడిగింపు పనులు ముందుకు రావడం లేదన్నారు. వెంటనే పర్చూరు మండలానికి భూసేకరణ కొరకు నోటిఫికేషన్ ఇవ్వాలని, సత్వరమే గుంటూరు చానల్ పొడిగింపు పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.చీరాల శాసనసభ్యులు కరణం బలరామకృష్ణమూర్తి ఈ సందర్భంగా మాట్లాడుతూ పర్చూరు మండలానికి భూసేకరణ పనులు వెంటనే చేపట్టేలా ప్రభుత్వానికి తెలియపరుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం గుంటూరు, బాపట్ల జిల్లా కార్యదర్శులు పాశం రామారావు, జి గంగయ్య, గుంటూరు బాపట్ల జిల్లాల నాయకులు కాకుమాను నాగేశ్వరరావు, దొప్పలపూడి రమేష్ బాబు, నల్లమడ రైతు సంఘం నాయకులు నరిశెట్టి ఆచారి, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు బండి శంకరయ్య, తల్లపనేని రామారావు,బండి శంంకరయ్య, కొత్త వెంకటశివరావు, చుక్క యానాదులు, దేవరపల్లి సర్పంచ్ తోకల కృష్ణమోహన్, రైతు నాయకులు గోరంట్ల భాస్కరరావు, వంకాయలపాటి వీరయ్య, నెల్లూరు రామారావు, నర్రా శ్రీనివాసరావు, గోరంట్ల రామకష్ణ, ఆళ్ల వెంకట్రావు, మిన్నెకంటి శివ, అడ్డగడ శ్రీనివాసరావు, దండా శ్రీనివాసరావు, పర్వతనేని బాపూజీ, లావు నాగేశ్వరరావు, నూతలపాటి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

బాపట్ల జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు, సిపిఎం బాపట్ల జిల్లా కార్యదర్శి జి గంగయ్య, గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు తదితరులు

గుంటూరు ఛానల్ కోసం సుధీర్ఘ పోరాటం

ఛానల్ పొడిగింపుతో 49 గ్రామాల సాగు, తాగునీటి సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా



ఉమ్మడి ప్రకాశం, గుంటూరు జిల్లాలలో నాగార్జున సాగర్ ఆయుకట్టు, కొమ్మమూరు కాలువ ఆయుకట్టు పరిధిలో చేరని రైతులు సుదీర్ఘకాలంగా తమ ప్రాంతాల భూములకు సాగునీరు తమ గ్రామాలకు తాగునీటి కోసం గుంటూరు ఛానల్ పొడిగింపు కోరుతూ నల్లమడ రైతు సంఘం, రైతు సంఘాలు, వామపక్షాలు, వివిధ రాజకీయ పార్టీలు పోరాటాలు చేస్తూ వస్తున్నారు. ముఖ్యంగా పర్చూరు, పెదనందిపాడు,చిలకలూరిపేట, పత్తిపాడు ప్రాంత రైతాంగం తమ భూములకు సాగు నీటి కోసం గత 85 సంవత్సరాలుగా పోరాడుతున్నారు.దశాబ్దాల పోరాటం అనంతరం ఛానల్ పొడిగింపు కోసం 2019లో రూ 274 కోట్ల నిధులు మంజూరు అయ్యాయి. పనులు ప్రారంభం అయితే ఈ మండాలకు చెందిన 48 వేల ఎకరాలకు సాగునీరు,49 గ్రామాల ప్రజలకు తాగునీరు లభిస్తాయి. ఇందుకు సంబంధించి వివరాలోకి వెళితే ...కృష్ణానదికి 40 మైళ్ళ దూరంలో అతి దగ్గరగా ఉన్న ఈ ప్రాంతం గత పాలకుల నిర్లక్ష్యానికి గురైంది.కృష్ణా జలాలు అందుబాటులోకి రాక,భూగర్భ జలాలు అడుగంటి, సాగు, తాగునీటి సమస్య పరిష్కారం కోసం గుంటూరు ఛానల్ పొడిగింపు కోరుతూ 1936 నుంచి రైతులు, పోరాటం చేస్తున్నారు. ఈ మేరకు 1961లో ఛానల్ పొడిగింపుకు అసెంబ్లీలో తీర్మానం చేశారు. ఛానల్ పొడిగింపుతో పాటు కృష్ణా కాలువ వద్ద రెండు రెండు ఎత్తిపోతల పథకాలు,పెదనందిపాడు, వేలూరు వద్ద మరో రెండు ఎత్తిపోతల పథకాలు నిర్మించాలని ప్రతిపాదనలు చేశారు.కాగా తాడేపల్లి మండలం పొలకంపాడు వద్ద కృష్ణా కాలువ నుంచి గుంటూరు జిల్లాలోని యామర్రు వరకు గుంటూరు ఛానల్‌ను నిర్మించారు.యామర్రు నుంచి పర్చూరు మండలం గారపాడు వరకు ఛానల్‌ను పొడిగించాలని రైతులు కోరుతూ వచ్చారు.రైతుల డిమాండ్ మేరకు కదిలిన ప్రభుత్వం భూసేకరణ కోసం ఆదేశాలు జారీ చేయడం జరిగింది.ఈ ఛానల్‌ను పర్చూరు వరకు పొడిగించేందుకు 686 ఎకరాల భూసేరణ జరపాలని ఇందు కోసం రూ 113 కోట్ల వరకు నిధులు అవసరం అని అధికారులు అంచనా వేశారు. ఈ మేరకు పత్తిపాడు, పెదనందిపాడు, వట్టి చెరుకూరు ప్రాంతం వరకు భూ సర్వే పూర్తి చేశారు.పర్చూరు ప్రాంత భూ సర్వే జరగలేదు.పర్చూరు మండలంలో ఏదుబాడు,గర్నెపూడి,ఇనగల్లు గ్రామాల్లో కాలువ పొడిగింపు కోసం భూసేకరణ జరగాల్సి ఉంది.

గుంటూరు ఛానల్ కోసం రూ.274 కోట్లు మంజూరు

రైతుల పోరాటం ఫలితంగా రెండేళ్ళ క్రితం రూ 330 కోట్ల అంచనాలతో పనులు ప్రారంభించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. రూ 274 కోట్ల నిధులు మంజూరు చేసి టెండర్లు పిలిచారు.24 నెలల్లో పనులు పూర్తి చేయాలని నిర్ధేశించారు.కాని పనుల ప్రారంభమే లేదు. ఈ గుంటూరు ఛానల్ ఏర్పాటు వలన 49 గ్రామాల పరిధిలో 48 వేల ఎకరాలకు సాగు నీరు, ఆ గ్రామాలకు తాగునీరు లభిస్తుంది.ప్రదానంగా పర్చూరు మండలంలో 22 గ్రామాలకు సాగు, తాగునీరు లభిస్తాయి. అలానే చిలకలూరిపేట సమీపంలోని వేలూరు వద్ద ఉన్న చెరువును పూర్తి స్థాయిలో నింపి అక్కడ నుంచి పర్చూరు వరకు కాలువ ద్వారా ఎత్తిపోతల పద్దతిలో నీరు పంపాలని ప్రతిపాదనలు చేశారు. గుంటూరు చానల్‌ను పొడిగించడం వలన సాగర్ ఆయుకట్టు మరియు కొమ్మమూరు కాలువ పరిధిలో చేరని వేలాది మెట్ట భూములకు సాగు నీరు అందుతుంది. ఆయా గ్రామాల ప్రజలకు తాగునీరు అందుతాయి.ప్రధానంగా గుంటూరు ఛానల్ పొడిగింపు కోరుతున్న గ్రామాల్లో తాగడానికి మంచినీరు లేని పరిస్థితి ఉంది. భూగర్భ జలాలు అడుగంటాయి. ఇలాంటి నేపథ్యంలో ఛానల్ పొడిగింపు ద్వారా 49 గ్రామాల రైతులకు, ప్రజలకు మేలు జరుగుతుంది.

రోడ్లపై వ్యర్థాలు వేస్తే కఠిన చర్యలు

రెడ్డిపాలెం ఇన్నర్ రింగురోడ్డు, టెలికాం నగర్‌లో కమిషనర్ పరిశీలన

ప్రజాశక్తి - గుంటూరు

పారిశుధ్య పనులు పక్కాగా జరగాలని, రోడ్ల మీద, కాల్వల్లో వ్యర్థాలు వేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజారోగ్య అధికారులు, శానిటేషన్ కార్యదర్శులను కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. రెడ్డిపాలెం ఇన్నర్ రింగ్‌రోడ్డు, టెలికాం నగర్ తదితర ప్రాంతాల్లో కమిషనర్ మంగళవారం పర్యటించారు. 2023 స్వచ్ఛ సర్వేక్షణ్‌లో గుంటూరు నగరం మెరుగైన ర్యాంకు సాధించేందుకు అందరూ కృషి చేయాలని కోరారు. ఇంటింటి చెత్త సేకరణ నూరు శాతం జరగాలని, ఇంటి గేటుకు ఉన్న ట్యాగ్‌ను తప్పనిసరిగా స్కాన్ చేయాలని చెప్పారు. చెత్త తరలింపు వాహనాలు ప్రతి డివిజన్ వెళ్లాలని, సమస్యలుంటే సంబంధిత ఇంజినీరింగ్ అధికారుల దృష్టికి తేవాలని చెప్పారు. ప్రతి అపార్ట్‌మెంట్‌లో క్లస్టర్ కంపోస్ట్, హోం కంపోస్ట్ చేసేలా అవగాహన కలిగించాలని, రోడ్ల మీద, కాల్వల్లో వాణిజ్యసంస్థలు వ్యర్థాలను వేస్తే సీజ్ చేయాలని స్పష్టం చేశారు. నిర్మాణాలేమైనా నగరపాలక సంస్థ నుండి తీసుకున్న ప్లాన్ ప్రకారమే ఉండాలని, అనధికార నిర్మాణాలు, లే అవుట్లు ఉంటే ప్లానింగ్ కార్యదర్శిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రతి నిర్మాణం అసెస్మెంట్ కలిగి ఉండాలని, నూతన భవనాలకు ఎప్పటికప్పుడు పన్ను విధించాలని అడ్మిన్ కార్యదర్శులను ఆదేశించారు. ఇన్నర్ రింగ్ రోడ్డు, టెలికాం నగర్లలో నూతనంగా నిర్మాణం చేసిన సిసి డ్రెయిన్, రోడ్ల నాణ్యత, కొలతలు పరిశీలించారు. పనుల్లో నాణ్యతా లోపాలుంటే కాంట్రాక్టర్‌తో పాటు ఇంజినీరింగ్ అధికారులు, ఎమినిటి కార్యదర్శులపైనా చర్యలు తప్పవని హెచ్చరించారు. పనులు నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలన్నారు. పర్యటనలో ఎస్ఇ భాస్కర్, ఇఇలు కొండారెడ్డి, డిఇఇలు శ్రీనివాసరెడ్డి, శివకుమార్, ఎఇలు రాము, అనూష, రవికిరణ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వరరావు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ నిర్మాణ కొలతలను పరిశీలిస్తున్న కమిషనర్

చెత్తపన్నును రద్దు చేయాలి

నేడు మంగళగిరిలో రాజకీయపార్టీల ర్యాలీ, ధర్నా

ప్రజాశక్తి - మంగళగిరి

రాష్ట్ర ప్రభుత్వం చెత్త పై పన్ను విధించడానికి వ్యతిరేకిస్తూ పన్నును రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం మంగళగిరి పట్టణంలోని పాత బస్టాండ్ సెంటర్లో ఉదయం 10 గంటల నుండి ర్యాలీ నిర్వహిస్తున్నట్లుగా, అదేవిధంగా కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్నట్లుగా సిపిఐ, సిపిఎం, సిపిఐ ఎంఎల్, టిడిపి, కాంగ్రెస్, వివిధ ప్రజా సంఘాలు, దళిత సంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్నట్లుగా మంగళవారం ఒక ప్రకటన పేర్కొన్నారు. గతంలో ఎన్నడు లేని విధంగా చెత్త పై పన్ను విధించడానికి ఆ పార్టీలు తీవ్రంగా ఖండించాయి. పన్ను రద్దు చేసే వరకు దశల వారి ఆందోళన చేయాలని అందులో భాగంగానే ధర్నా, ర్యాలీ నిర్వహిస్తున్నట్లుగా తెలిపారు. ప్రజల పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

రిజర్వాయర్లను ప్రతినెలా శుభ్రం చేయండి

పట్టణ ఆరోగ్య కేంద్రాలను ప్రారంభానికి సిద్ధం చేయాలి

వివిధ శాఖల అధికారుల సమీక్షలో గుంటూరు నగర కమిషనర్

ప్రజాశక్తి - గుంటూరు

జగనన్న లే అవుట్లలో ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని, నిర్మాణాలపై లే అవుట్ ప్రత్యేకాధికారులు ప్రతిరోజూ నివేదించాలని కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. గృహ నిర్మాణం, తాగునీటి సరఫరా, అభివృద్ధి పనులు, నాడు-నేడు పనులపై అధికారులతో స్థానిక శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో కమిషనర్ మంగళవారం సమీక్షించారు. ఇళ్ల నిర్మాణం వేగవంతానికి సచివాలయ కార్యదర్శులు సహకరించాలని, పనులు పొందిన కాంట్రాక్టర్లు మరింత వేగంగా పనులు చేయాలని చెప్పారు. లే అవుట్లలో ప్రధాన, అంతర్గత రహదారులను అభివృద్ధి చేయాలని, అన్ని లైన్లకూ విద్యుత్ స్తంభాలు వేయాలని చెప్పారు. ఎం.బుక్ రికార్డింగ్‌పై ఎమినిటీ కార్యదర్శులకు వచ్చేనెల 3న శిక్షణివ్వాలని చెప్పారు. పార్కుల అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, టెండర్ అయిన వాటిని నిర్దేశిత కాలపరిమితితో పూర్తి చేయాలని ఆదేశించారు. గాంధీపార్క్ పనులను ఇఇ ప్రత్యక్షంగా పర్యవేక్షించాలని చెప్పారు. తాగునీటి సరఫరాలో సమస్యలు రానివ్వొద్దని, లీకులు, కలుషిత నీటి సరఫరాను గుర్తిస్తే సంబంధిత ఎఇల ద్వారా వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తేవాలని అన్నారు. రిజర్వాయర్లను ప్రతినెలా తప్పకుండా శుభ్రం చేయాలని, నూతనంగా ఏర్పాటు చేయనున్న సెంట్రల్ మీడియన్స్‌కు ఫైల్స్ వెంటనే సిద్ధం చేసి పంపాలని చెప్పారు. ట్రాఫిక్ ఐలాండ్స్ అభివృద్ధిపై అంచనాలు రూపొందించాలని, నిర్మాణ దశలో ఉన్న వైఎస్‌ఆర్ పట్టణ ఆరోగ్య కేంద్రాలను నెలాఖరుకు పూర్తి చేసి ప్రారంభోత్సవాలకు సిద్ధం చేయాలని ఆదేశించారు. పాఠశాలల్లో నాడు-నేడు పనులను వేగవంతం చేయాలన్నారు. సమీక్షలో ఎస్ఇ భాస్కర్, ఇఇలు సుందర్రామిరెడ్డి, శాంతిరాజు, కొండారెడ్డి, కోటేశ్వరరావు, ఏపిసిపిడిసిఎల్ ఇఇ శ్రీనివాసబాబు, ఎడిహెచ్ రామారావు, ఎంఇఒ ఖుద్దూస్, హౌసింగ్ ఇఇ శంకరరావు, నగరపాలక సంస్థ డిఇఇలు, హౌసింగ్ డిఇఇలు, ఎఇలు ఎమినిటి కార్యదర్శులు పాల్గొన్నారు.

త్వరలో 10 వేల కిలో మీటర్ల పాదయాత్ర

బిజెపి రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు

ప్రజాశక్తి-గుంటూరుజిల్లా ప్రతినిధి

రాష్ట్రంలో ప్రజాసమస్యలు తెలుసుకునేందుకు గ్రామీణ ప్రాంతాల్లో తమ పార్టీ 10 వేల కిలో మీటర్ల వరకు పాదయాత్రలు నిర్వహిస్తున్నట్టు బిజెపి రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు తెలిపారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పై ప్రజలు తీవ్ర వ్యతిరేకతతో వున్నారని తెలిపారు. తమ పార్టీ జనసేనతో కలిసి పనిచేస్తుందన్నారు. జనసేనతో తప్ప ఇతర పార్టీలతో తాము పొత్తుకు సిద్ధంగా లేమన్నారు. రాష్ట్రంలో బిజెపి, జనసేన కలసి వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తాయన్నారు. కేంద్రం ఇచ్చే ఎస్సి సబ్ ప్లాన్ నిధులు పక్కదారి పట్టించి దళితులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. దళితులకు కేటాయించిన పథకాలను పునరుద్ధరించాలని కోరుతూ గుంటూరులో ఎస్సి మోర్చా ఆధ్వర్యంలో చేపట్టిన 48 గంటల దీక్షల్లో మంగళవారం ఆయన పాల్గొన్నారు. ఎస్సిలకు రూ.32 వేల కోట్లను కేటాయిస్తే వీటిని ఇతర పథకాలకు వైసిపి ప్రభుత్వం మళ్లించిందన్నారు. ఎస్సిలకు గతంలో ఉన్న 26 పథకాలను రద్దు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. సిఎం జగన్ సంక్షేమం పేరుతో అభివృద్ధిని పక్కన పెట్టారని అన్నారు.

నకరికల్లు ఆర్ఐ మృతి

ప్రజాశక్తి - నకరికల్లు

మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ) ఆర్.హేమంత్ కుమార్ (54) మంగళవారం మృతి చెందారు. నెలరోజులుగా ఈయన సెలవులో ఉండగా ఈనెల 26వ తేదీనే విజయవాడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో బైపాస్ సర్జరీ చేయించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అందరితో స్నేహంగా మెలిగే హేమంత్‌కుమార్ మృతిపై పలువురు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి తహశీల్దార్ సురేష్, రెవెన్యూ సిబ్బంది ప్రగాఢ సానుభూతి తెలిపారు.

లక్ష్యంతో చదివితే మంచి ఫలితాలు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకుని అభ్యసిస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా చీఫ్ మేనేజర్ పి.జగదీష్ అన్నారు. మండలంలోని పోతవరం కస్తూర్బా బాలికల విద్యాలయం విద్యార్థులకు మంగళశారం రన్నింగ్, స్కిప్పింగ్, డ్రాయింగ్ అంశాల్లో మంగళవారం పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన వారికి పి.జగదీష్ బహుమతులు ప్రదానం చేశారు. చిలకలూరిపేట వైఎంసిఎ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సంస్థ గౌరవాధ్యక్షులు చుక్కా విన్సెంట్‌పాల్, అధ్యక్షులు రామ్మోహనరావు, కార్యదర్శి పి.కెనడీ, ప్రిన్సిపాల్ అశ్రీఫున్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సత్కారం అందుకుంటున్న నూతన వైద్యులు

సత్తెనపల్లి ఆస్పత్రికి మరో ఇద్దరు వైద్యులు

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

స్థానిక ఏరియా వైద్యశాలకు నియమితులైన ఇద్దరు వైద్యులు తమ బాధ్యతలను మంగళవారం చేపట్టారు. పాథాలజిస్టు డాక్టర్ ప్రపుల్ల, జనరల్ సర్జన్ డాక్టర్ రాజేష్ విధుల్లో చేరగా వారికి ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ, ప్రధాన వైద్యులు డాక్టర్ వెంకట్రావు శుభాకాంక్షలు తెలిపారు. గతంలో ఏరియా ఆస్పత్రిలో ఆరుగురు వైద్యులే ఉండగా ఇప్పుడు 22కు పెరగడం సంతోషంగా ఉందని, వీరి సేవలను ప్రజలు ఉపయోగించుకోవాలని కొత్త రామకృష్ణ అన్నారు. కార్యక్రమంలో ఆర్ఎంవో శోభారాణి పాల్గొన్నారు.

సత్రశాల ఆలయంలో ముగిసిన వేలం

ప్రజాశక్తి - రెంటచింతల: మండలంలోని సత్రశాల వద్ద ఉన్న శ్రీ గంగా భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయానికి సంబంధించిన వేలం మంగళవారం ముగిసినట్లు ఈవో గాదె రామిరెడ్డి తెలిపారు. స్థానిక శివాలయంలో నిర్వహించిన కొబ్బరికాయలను విక్రయించడానికి రూ.2,37,000, ప్రసాదం అమ్మకానికి రూ.65000 చొప్పున వేలాన్ని ఏడాదిపాటు రామ్మోహనరావు దక్కించుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ లీలావతి పాల్గొన్నారు.

క్రీడల్లో పల్నాడు విద్యార్థుల ప్రతిభ

విద్యార్థినులతో హెచ్ఎం తదితరులు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

వినుకొండలో ఇటీవల నిర్వహించిన ఉమ్మడి గుంటూరు జిల్లా బాలికల బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో మండలంలోని పసుమర్రు శ్రీ మద్ది కామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ప్రతిభ చూపారు. అండర్-17 విభాగంలో కె.కావ్య, అండర్-14 విభాగంలో కె.అమూల్య జిల్లా జట్టుకు ఎంపికైనట్లు హెచ్ఎం మహమ్మద్ యాసిన్ మంగళవారం తెలిపారు. వీరు ఈనెల 29న కడప జిల్లా ప్రొద్దుటూరులో నిర్వహించ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పిఇటి పఠాన్ ఖాదర్ మస్తాన్ చెప్పారు. ఎంపికైన వారిని 15, 16 వార్డుల కౌన్సిలర్లు జాలాది సుబ్బారావు, షేక్ మస్తాన్‌వలి, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ ఎర్రం వెంకటసుబ్బయ్య, పూర్వ విద్యార్థుల సంఘ నాయకులు జి.హరిబాబు, మాజీ చైర్మన్ మీరావలి, ఉపాధ్యాయులు అభినందించారు.

వర్సిటీ తైక్వాండో జట్టుకు 'కృష్ణవేణి' విద్యార్థి

ప్రజాశక్తి - నరసరావుపేట

బాపట్ల జిల్లా అద్దంకిలో ఇటీవల నిర్వహించిన ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అంతర్ కళాశాలల తైక్వాండో పోటీల్లో తమ కాలేజీ విద్యార్థి ఆర్.మోహన్ గోపాల్ ఉత్తమ ప్రతిభ చూపి వర్సిటీ జట్టుకు ఎంపికైనట్లు కృష్ణవేణి డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. 63 కిలోల విభాగంలో బంగారు పతకంతోపాటు సాధించాడని, వచ్చేనెల 4, 5, 6 తేదీల్లో పంజాబ్‌లోని గురునానక్‌దేవి యూనివర్సిటీలో నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో మోహన్‌గోపాల్ పాల్గొననున్నట్లు వివరించారు. మోహన్ గోపాల్‌ను కళాశాల యాజమాన్యం, పీడీ ఈదర ఆదిబాబు, అధ్యాపకులు అభినందించారు.

ప్రతి సచివాలయానికీ ముగ్గురు కన్వీనర్లు

మాట్లాడుతున్న పిన్నెల్లి వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి - కారెంపూడి

ప్రజలందరికీ ప్రభుత్వ సేవలు, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను తెచ్చిందని వైసిపి యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకటరామిరెడ్డి అన్నారు. మండల కేంద్రమైన కారంపూడిలోని జివిఆర్ కళ్యాణ మండపంలో వాలంటీర్లకు మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని 12 సచివాలయాలు ఉండగా ప్రతి సచివాలయాకి ముగ్గురు కన్వీనర్లను ఏర్పాటు చేశారు. వీరిలో ఒకరు మహిళ, ఇద్దరు పురుషులు ఉండి పథకాలు, అభివృద్ధిని ప్రజలకు అందేలా చూడాలని చెప్పారు. సంక్షేమ పథకాలు అందని వారి వివరాలను సేకరించి అర్హతుంటే వారికీ ప్రభుత్వ ఫలాలు అందించాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపిపి ఎం.శారద శ్రీనివాసరెడ్డి, జెడ్‌పిటిసి షఫీ, వైసిపి మండల కన్వీనర్ కె.సుబ్రహ్మణ్యం, సిహెచ్.చంద్రశేఖర్‌రెడ్డి, కో-ఆప్షన్స్ సభ్యులు ఎ.ఏసోబు, బి.ఆల్లయ్య, వెంకట నరసయ్య, కె.చంద్రశేఖర్, వి.పద్మ లింగయ్య పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై నేడు ప్రజావేదిక

ప్రజాశక్తి - పెదకూరపాడు

ఉపాధి హామీ కింద రెండేళ్లుగా చేసిన పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక పెదకూరపాడులో బుధవారం నిర్వహిస్తామని ఎంపిడిఒ నరసింహారావు, ఎంపిఒ కోటేశ్వరరావు మంగళశారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 20 గ్రామాల్లో జరిగిన పనులపై వివరణ ఉంటుందని పేర్కొన్నారు.

కుంటి సాకులతో పింఛన్ల కోత : టిడిపి

ప్రజాశక్తి - వినుకొండ

అర్హులైన వారి పింఛన్ల తొలగింపు దారుణమని, కుంటి సాకులతో రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 10 లక్షల మందికి రాష్ట్ర ప్రభుత్వం అన్యాయం చేస్తోందని టిడిపి పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు జీ.వీ.ఆంజనేయులు విమర్శించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. 300 యూనిట్లు కరెంట్ బిల్లు, నాలుగు చక్రాల వాహనాలు, ఆదాయ పన్ను, అధికంగా భూమి, 1000 గజాలకు పైగా ఇల్లులు ఉన్నాయంటూ తప్పుడు సమాచారంతో అర్హుల పింఛన్లు తొలగిస్తున్నారన్నారు. పల్నాడు జిల్లాలో సుమారు 15 వేల పెన్షన్లు అక్రమంగా తొలగించాలని, వినుకొండ నియోజకవర్గంలో ఈ తొలగింపు అధికంగా ఉందని అన్నారు. రేషన్ కార్డుల తొలగింపునకూ ప్రభుత్వం సిద్ధమవడం సిగ్గుచేటన్నారు. జాబ్ కేలండర్ విషయంలో యువతను మోసం చేశారని, మద్యం షాపులతో ప్రజల ఆదాయాన్ని దోచేస్తున్నారని దుయ్యబట్టారు. బాధితుల తరుపున టిడిపి పోరాడుతుందని, పింఛన్లను పీకేసిన ముఠాను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు పి.దాసయ్య, ఆర్.వీరాంజనేయరెడ్డి, పివి.సురేష్‌బాబు, ఎం.మురళీకృష్ణ యాదవ్,. సౌదాగార్ జానిబాషా పాల్గొన్నారు.

ప్రజాశక్తి - రొంపిచర్ల

వైసిపి పాలనలో రాష్ట్ర అన్ని రంగాల్లోనూ వెనకబడిందని టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు జీవీ ఆంజనేయులు, నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు విమర్శించారు. మండల కేంద్రమైన రొంపిచర్లలో 'ఇదేం కర్మ రాష్ట్రానికి' కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలపై మాట్లాడారు. స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగారు. ఈ సందర్భంగా జీవీ ఆంజనేయులు, అరవిందబాబు మాట్లాడుతూ టిడిపి నాయకులు, కార్యకర్తలపై దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. సంక్షేమ పథకాలు కంటితుడుపుగా ఇస్తూ భారాలు మాత్రం మోయలేని విధంగా వేస్తున్నారని విమర్శించారు. మూడు రాజధాన్లు పేరుతో రాజధాని ప్రాంతమైన అమరావతి ప్రజలను తీవ్ర అన్యాయం చేశారన్నారు. రాష్ట్రం సరైన దిశలో నడవాలంటే చంద్రబాబునాయుడు మళ్లీ సిఎం కావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు జి.కోటేశ్వరరావు, పి.రామిరెడ్డి, కె.బ్రహ్మయ్య, కె.కోటిసుబ్బారావు, ఐ.కాశయ్య, పి.గోవిందరెడ్డి, యు.అనిల్, పి.జగ్గయ్య పాల్గొన్నారు.

ఆధార్ సవరణలకు ప్రత్యేక కార్యక్రమం

ప్రజాశక్తి - నరసరావుపేట

ఆధార్ కార్డును ప్రతిఒక్కరూ పదేళ్లకోసారి సవరణలు చేయించుకోవాలని, ఇఒపిఆర్‌డి విజయ్‌కుమార్ కోరారు. దీనికోసం మండలంలో ప్రత్యేక కార్యక్రమం చేపడుతున్నట్లు మంగళవారం తెలిపారు. నాలుగు రోజులపాటు నిర్వహించే కార్యక్రమాల్లో భాగంగా సోమవారం కొండ కావూరులో కార్యక్రమం నిర్వహించామని, బుధవారం పెట్లూరివారి పాలెం, గురు, శుక్రవారాల్లో ఉప్పలపాడు, శనివారం లింగంగుంట్లలోని సచివాలయాల్లో ఈ కార్యక్రమాలు ఉంటాయని, ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు.

24X7 అందుబాటులో ఆర్టీసీ కార్గో సేవలు

ప్రజాశక్తి - నరసరావుపేట

ఆర్టీసీ కార్గో సేవలను అందించేందుకు సిబ్బంది 24x7 అందుబాటులో ఉంటారని, అతి తక్కువ ఖర్చుతో తక్కువ సమయంలో వినియోగదారుకు చెందిన వస్తువులను గమ్యస్థానాలకు రవాణా చేస్తామని నరసరావుపేట డిపో మేనేజర్ బి. వీరాస్వామి అన్నారు. ఈ మేరకు మంగళశారం ఒక ప్రకటన జారీ చేశారు. కార్గోను 2017లో ప్రారంభించామని, 2018-19 ఆర్థిక సంవత్సరంలో రూ.70 కోట్లు, 2019-20లో రూ.90 కోట్ల ఆదాయం లభించినట్లు తెలిపారు. కరోనా నేపథ్యంలో 2020-21లో కొంత మేర ఆదాయం తగ్గినా 2021-22లో రూ.122 కోట్లు, 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఈ నెల 5వ తేదీ నాటికి రూ.122 కోట్లు దాదాయం వచ్చినట్లు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం పూర్తయ్యే నాటికి మరో రూ.35-40 కోట్ల ఆదాయం వచ్చే అవకాశం ఉందని తెలిపారు. గతంలో ఎఎన్ఎల్ అనే ప్రైవేట్ సంస్థకు కాంట్రాక్ట్ ఇచ్చామని, ఇప్పుడు ఆర్టీసీనే సొంతగా నిర్వహిస్తోందని, ప్రజలు ఆదరించాలని కోరారు.

ప్రభుత్వ పరిశీలనలో లిఫ్ట్ ఇరిగేషన్ : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - రెంటచింతల : మండలంలోని తమ్మకోటలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించగా ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. రెండువేల ఎకరాలకు సాగు నీరందించే కృష్ణానది లిఫ్ట్ ఇరిగేషన్ పథకం ప్రభుత్వ పరిశీలనలో ఉందని చెప్పారు. వివిధ సమస్యలపై స్థానికుల నుండి అర్జీలు స్వీకరించారు. సర్పంచి నలబాలునాయక్, ఎంపిపి చౌడేశ్వరి, జెడ్‌పి వైస్ చైర్మన్ నర్సిరెడ్డి ఉమామహేశ్వర్‌రెడ్డి, ఎంపిడిఒ గౌసియా బేగం, తహశీల్దార్ పుల్లారావు పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో అరవిందబాబు, ఇబ్రహీం కుటుబీకులు

హత్యకు పథకం పన్నిన వారినీ అరెస్టు చేయండి

ఇబ్రహీం కుటుంబీకులతో కలిసి ఎస్పీకి అరవిందబాబు వినతి

ప్రజాశక్తి - నరసరావుపేట

వైసిపికి చెందిన రౌడీ మూకల చేతిలో హత్యకు గురైన వరవకట్టకు చెందిన షేక్ ఇబ్రహీం కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాడతామని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు అన్నారు. ఇబ్రహీం కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ కుటుంబ సభ్యులతో కలిసి పల్నాడు జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డిని మంగళవారం కలిసి వినతిపత్రం ఇచ్చారు. హత్య చేసిన నిందితులను అరెస్టు చేశారని, అయితే హత్యకు పథకం పన్నిన ఎంవి ఫుట్వేర్ యజమాని సుభాని, ఖాజావలిని కూడా అరెస్టు చేయాలని కోరారు. వారి నుండి మృతుని కుటుంబానికి పరిహారం ఇప్పించాలన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి-తాడేపల్లి: తాడేపల్లి పట్టణంలోని ప్రకాష్‌నగర్‌లోని తెల్లక్వారీలో రూ.7 లక్షలతో చేపట్టిన డ్రెయిన్ నిర్మాణ పనులను మంగళవారం అధికారులు పరిశీలించారు. ఉండవల్లిలో రూ.12.37 లక్షల నిధులతో జరుగుతున్న హిందూ శ్మశానవాటిక కాంపౌండ్ నిర్మాణ పనులు పంచాయతీ కార్యదర్శి రాధాకుమారి పర్యవేక్షించారు.

వరి పైరులో పంటకోత ప్రయోగం

ప్రజాశక్తి -పొన్నూరు రూరల్

పొన్నూరు పట్టణం బ్రాహ్మకోడూరు గ్రామంలో వరి పైరులో పంట కోత ప్రయోగాలు నిర్వహించారు. ఇద్దరు రైతుల పొలాలలో 5-5 చదరపు మీటర్ల విస్తీర్ణంలో సోపాటి వెంకాయమ్మ వరి పైరులో వచ్చిన దిగుబడిని 7.940కిలోలు వచ్చాయని, దిగుబడి 20 బస్తాలు అవుతాయని తెలిపారు. అలాగే దేవరపల్లి దావీదు వరి పైరులో 5-5 చదరపు మీటర్లు వచ్చిన దిగుబడి 19.300కిలోలు వచ్చిందిని, సుమారు 42 బస్తాల దిగుబడి వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక మండల వ్యవసాయ అధికారి డేగల వెంకట్రామయ్య ,స్థానిక గ్రామ వ్యవసాయ సహాయకులు చందు సరిత, ఆర్‌బికే మిత్ర సాయి, రైతులు పాల్గొన్నారు.

పౌరాణిక కళాకారుడు శివనాగేశ్వరరావుకు సత్కారం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

స్థానిక బోస్ రోడ్డు పెమ్మసాని థియేటర్లో ఏడాది పాటు టిడిపి మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శకపురుషుని శతజయంతి మహోత్సవాల్లో భాగంగా మంగళవారం భలే అమ్మాయిలు చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. సత్కారాల పండుగ కార్యక్రమంలో భాగంగా ప్రముఖ పౌరాణిక నాటక కళాకారుడు భూదాటి శివనాగేశ్వరరావును పట్టణ టిడిపి నాయకులు షేక్ నాగూర్, టి. గోపి, షేక్ ముజీబ్, డి. భాస్కర్ తదితరులు సత్కరించారు. పి. పోతురాజు, డి. భవాని, ఎన్టీఆర్ జగన్, ఎం. రాఘవరావు, జి.ప్రసాద్, ఎం.శ్రావణ్, ఎన్. శ్రీనివాస్, మహేష్ పాల్గొన్నారు.

నూతన సంవత్సర కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - మంగళగిరి

ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఎఎల్)2023 నూతన సంవత్సర కేలెండర్‌ను మంగళవారం మంగళగిరి బార్ అసోసియేషన్ అధ్యక్షులు దొడ్డక బ్రహ్మానందరావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మంగళగిరి బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి తోట నరసింహారావు, ఉపాధ్యక్షులు జొన్నాదుల లెనిన్ బాబు, దొడ్డక బ్రహ్మయ్య, కుదారి శేఖర్ , తాడిబోయిన రోశయ్య, సురబోయిన మురళీకష్ణ తిరుమలరావు, మహిళా న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

అంగలకుదురులో విద్యార్థికి ట్యాబ్ అందజేస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

కొప్పర్రులో విద్యార్థి ట్యాబ్ అందజేస్తున్న ఉప ఎంపిపి ఖాసింబి

సాంకేతిక పరిజ్ఞానంతో మెరుగైన విద్య

ప్రజాశక్తి-తెనాలి

విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానానంతో మెరుగైన విద్యనభ్యసించాలని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. రూరల్ గ్రామం అంగలకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో 8తరగతి విద్యార్థులకు ఏర్పాటు చేసిన ట్యాబుల పంపిణీలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయిని డాక్టర్ రోజ్‌లిండ్ అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తి స్థాయి మౌలిక వసతులు కల్పిస్తుందన్నారు. అలాగే ట్యాబుల వినియోగం ద్వారా పాఠ్యాంశాలపై మరింత అవగాహన పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ కె.రవిబాబు, జెడ్పీటసి ఉమా ప్రణతి, ఎంపిపి చెన్నుబోయిన శ్రీనివాసరావు, పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

పొన్నూరు రూరల్:మండలంలోని దొప్పలపూడి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం 8వ తరగతి చదివే పిల్లలకు జగనన్న ఉచిత టాబ్‌లను పొన్నూరు జడ్‌పిటిసి రమేష్, ఎంపీపీ భవనం పద్మలీలలు విద్యార్థులకు అందించారు. భవనం పద్మలీల మాట్లాడుతూ ఈ టాబ్‌ల ద్వారా విద్యార్థులు ఆధునిక పరిజ్ఞానాన్ని అందిపుచుకొని ఉన్నత శిఖరరాలకు ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ పాల్గొన్నారు.

పెదనందిపాడు: పెదనందిపాడు మండలం కొప్పర్రు గ్రామంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ లో 8వ తరగతిలోని 22 మంది విద్యార్థులకు ట్యాబులు పంపిణి చేశారు, ఈ కార్యక్రమంలో పెదనందిపాడు ఎంపిపి తమలపాకుల హేబ్సిబా , జడ్పీటీసీ కల్లూరి అన్నపూర్ణ , పెదనందిపాడు వైస్ ఎంపిపి షేక్ ఖాసీంబి , కొప్పర్రు గ్రామ సర్పంచ్ సాతులూరి సురేష్, ఉపసర్పంచ్ ఏ.శ్రీకాంత్ , కొప్పర్రు ఎంపిటిసి షేక్ రమేష్ బాబు, ఉపాధ్యాయలు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి ప్రభుత్వం కృషి : ఎమ్మెల్యే అన్నాబత్తుని

ప్రజాశక్తి-తెనాలి

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. రూరల్ గ్రామం అంగలకుదురు నుంచి కోపల్లె, గుడివాడ గ్రామాలకు అనుసంధానంగా ఉన్న రోడ్డు నిర్మాణం పూర్తికావటంతో, దానిని మంగళవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తోందన్నారు. గ్రామాలకు అనుసంధానంగా ఉన్న రోడ్లు రైతులతో పాటు ప్రజానీకానికి ఉపయోగమన్నారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని గమనించి ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలన్నారు. కార్యక్రమంలో ఎంపిపి చెన్నుబోయిన శ్రీనివాసరావు,

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

జెడ్పిటిసి పిల్లి ఉమాప్రణతి, పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ధరల తగ్గడం లేదు..పన్నులు ఆగడం లేదు..

ప్రజాశక్తి- తాడేపల్లి రూరల్

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం పెరిగిన ధరలను తగ్గించకపోగా, అధిక పన్నులు విధిస్తుందని టిడిపి నాయకులు విమర్శించారు. మంగళవారం మండల పరిధిలోని గెండిమెడ గ్రామంలో ఇదేం కర్మ రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా టిడిపి నాయకులు ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలు పంచారు. ఈ సందర్భంగా టిడిపి తాడేపల్లి మండల అధ్యక్షులు అమరా సుబ్బారావు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలపై అధిక ధరలు పెంచి భారాలు

మోపుతుందున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి తాడేపల్లి మండల మాజీ అధ్యక్షులు కె. కిరణ్, ఉపాధ్యక్షులు జి.రమేష్ బాబు, గ్రామ అధ్యక్షులు చిగురుపాటి సుబ్బారావు, చొప్పర బుల్లి బాబు, ఏ.వీరాంజనేయ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

రూ.49.70లక్షలతో రోడ్డు నిర్మాణం

ప్రజాశక్తి - మంగళగిరి

రత్నాల చెరువునుండి రహదారి వరకు రూ. 49.70లక్షలతో నిర్మించిన రోడ్డు, పుచ్చలపల్లి సుందరయ్య ముఖ ద్వారాన్ని మంగళవారం ఎమ్మెల్యే ఆళ్ళ రామకృష్ణారెడ్డి, మురుగుడు హనుమంతురావులు శిలాఫలకాన్ని ఆవిష్కరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ దశబ్దాల కాలంగా నియోజక వర్గ ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారని , అందుకే రహదారుల నిర్మాణాన్ని చేపట్టామని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారానికి గతంలో కమ్యూనిస్టు నేతలు కూడా ఎంతో కృషి చేశారని, వారి కృషికి గుర్తింపుగా కమ్యూనిస్టు నాయకులు పుచ్చలపల్లి సుందరయ్య పేరుతో ముఖం ద్వారాన్ని నిర్మించామని తెలిపారు. అనంతరం ఏపిటిఐడిసిఓ ఇళ్ళ స్థలములకు సంబంధించి రిజిస్ట్రేషన్ అయిన 15 మంది లబ్దిదారులకు ఇళ్ళ పట్టాలను ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్యే ఆళ్ళ రామకష్ణారెడ్డి, కమీషనర్ యు.శారదాదేవి, అడిషనల్ కమీషనర్ శ్రీమతి కె.హేమ మాలిని చేతుల మీదుగా అందజేశారు. అనంతరం పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించుటకు సుమారు రూ.1.30 కోట్లతో నూతనంగా కొనుగోలు చేసిన 12 ట్రాక్టర్లను లాంచనంగా ప్రారంభించారు. జనవరి 2వ తేదీన ముక్కోటి ఏకాదశి సందర్భంగా భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా స్వామివారి దర్శనం , దక్షిణావత శంకు తీర్థం అందేలా చూడాలని దేవాలయ అధికారులకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి సూచనలు చేశారు. శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో జరుగుతున్న ముక్కోటి ఏకాదశి ఏర్పాట్లను

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి

ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుతో కలిసి పరిశీలించి మాట్లాడారు. స్వామివారి దర్శనానికి వచ్చే ప్రతి ఒక్కరికి ఉచిత ప్రసాదం, క్యూ లైన్లో తాగునీరు ఏర్పాటు చేయాలని అన్నారు. దర్శనాలకు విఐపిలకు ప్రత్యేక సమయాన్ని కేటాయించాలని కార్యక్రమంలో వైసిపి చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గంజి చిరంజీవి, పట్టణ పార్టీ కన్వీనర్ మునగాల మల్లేశ్వరరావు, కమిషనర్ శారదాదేవి, డీఈ కష్ణారెడఆలయ ఈఓ ఏ రామకోటిరెడ్డి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి- మంగళగిరి

మంగళగిరి ఐసిడిఎస్‌కు పరిధిలో మూడు అంగన్‌వాడీ సహాయకురాలు పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలని ఐసిడిఎస్ మంగళగిరి ప్రాజెక్టు అధికారి ఎం గౌరీ శంకరి మంగళవారం తెలిపారు. నవులూరు 8, బిసి డి కేటగిరి, పెదవడ్లపూడి 6, జనరల్ కేటగిరి, పెదవడ్లపూడి 8, బిసి ఎ కేటగిరి అంగన్‌వాడీ సహాయకురాలు పోస్టులకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వచ్చే నెల జనవరి 3వ తేదీ లోపు దరఖాస్తులను మంగళగిరి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో సాయంత్రం 5గంటల లోపు అందజేయాలని కోరారు. 7వ తరగతి పాస్ అయి ఉండాలి అని తెలిపారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి-తాడేపల్లి

నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) విద్యార్థినీ విద్యార్థుల శిక్షణ నిమిత్తం ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అందించిన స్టడీ మెటీరియల్‌ను తాడేపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో ఉపాధ్యాయులు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు రాయల సుబ్బారావు మాట్లాడుతూ 8వ తరగతి నుంచి ఇంటర్ వరకు ప్రభుత్వం ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష నిర్వహిస్తుందని చెప్పారు. పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు సంవత్సరానికి రూ.4 వేలు చొప్పున స్కాలర్‌షిప్ అందజేయనున్నారని తెలిపారు. తాడేపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ నుంచి ప్రతి సంవత్సరం విద్యార్థులు తమ ప్రతిభతో ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపికవుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రసాద్, కె.రాజ్యలక్ష్మి, అనిల్‌కుమార్, కోటేశ్వరరావు, అన్వర్,నాగశేషులు, పద్మజ పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్ల పరిశీలన

ప్రజాశక్తి-తాడేపల్లి

రాజధాని పరిధిలోని పెనుమాకలో టిడ్కో ఇళ్ల సముదాయాన్ని మంగళవారం స్థానిక ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి పరిశీలించారు. రోడ్లు, డ్రెయినేజీలు వంటి మౌలిక వసతులు పూర్తయ్యాయని ఆయన చెప్పారు. విద్యుత్ పనులు, తాగునీటి సరఫరా పనులు జరగాల్సి ఉందన్నారు. శాండ్ ఫిల్డర్ల ద్వారా తాగునీరు సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ శాఖ అధికారులు టిడ్కో డిపార్టుమెంట్‌కు ప్రతిపాదనలు పంపి నిధులు సేకరించాలని సూచించారు. మున్సిపల్ అధికారులు వెంటనే టిడ్కో అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. త్వరలోనే లబ్దిదారులకు ఇళ్లు అందజేస్తామని ఎమ్మెల్యే చెప్పారు.

లిస్ట్‌ను చూపుతున్న ఏపిఎం గోపి, తదితరులు

వైయస్సార్ ఆసరా గ్రూపులో తప్పులు సరిచేసుకోవాలి

ప్రజాశక్తి -పొన్నూరు రూరల్

మండల పరిధిలోని మునుకుదురులో వైఎస్ఆర్ ఆసరాకు సంబంధించిన అర్హత గల గ్రూపులు వివరాలను సోషలా అడిట్ నిమిత్తం మునుకుదురు సచివాలయంలో ఉంచామని ఏపిఎం గోపి తెలిపారు. మంగళవారం సచివాలయంలో ఆయన గ్రూపు సభ్యులతో మాట్లాడుతూ లిస్టులో సంఘ సభ్యుల గ్రూపు వివరాలు వెరిఫికేషన్ చేయించుకోవాలని, ఏమైనా అకౌంట్‌లో తప్పులు ఉంటే తెలియచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మునుకుదురు సర్పంచ్, పంచాయితీ సెక్రెటరీ, గ్రూపుసభ్యులు పాల్గొన్నారు.

అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం

ప్రజలు మెచ్చేలా పనిచేయండి : పోలీసు అధికారులకు ఎస్‌పి పిలుపు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పోలీసు లు ప్రజలు మెచ్చే విధంగా, నేరస్తులు భయపడే విధంగా అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే వారిపై ఉక్కుపాదం మోపాలని జిల్లా ఎస్‌పి ఆరీఫ్ హఫీజ్ కోరారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఉన్న కాన్ఫరెన్స్ హాలులో జిల్లా అధికారులతో నేర సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. నేర నియంత్రణకు, నేరస్తుల కదలికలపై నిఘా వుండాలని, విజిబుల్ పోలీసింగ్ ఉంటేనే నేరాలను నివారించ వచ్చుని తెలిపారు. కేసు దర్యాప్తు అంశాలలో, విధి నిర్వహణలో అలసత్వం ఉండరాదన్నారు. అధికారులు ఎప్పటికప్పుడు మారుతున్న చట్టాలను గురించి, కోర్టు కేసులపై అవగాహన పెంచుకోవాలన్నారు. మత్తు పదార్థాలు, నాటు సారా, గంజాయి,గుట్కా, ఖైని మొదలగు పదార్థాల నియంత్రణ విషయంలో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అన్నారు. రానున్న పండగలు నేపథ్యంలో అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో పేకాట, కోడి పందాలు జరగకుండా నివారణ కొరకు అధికారులు ప్రత్యేక దష్టి సారించి వాటిని పూర్తిగా నివారించాలి ఎక్కడైనా ఘటనలు జరిగినట్లు దష్టికి వస్తే తీవ్రమైన చర్యలు తీసుకుంటామన్నారు. మహిళల నుంచి వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించి వారికి సకాలంలో న్యాయం చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా టూవీలర్ దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయని సిసిఎస్ సిబ్బంది అధికారులు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమానికి వచ్చే ఫిర్యాదులపై కాలపరిమితిలోపు చర్యలు తీసుకొని విచారణ అంశాలను వెంటనే తెలియజేయాలన్నారు. అదనపు ఎస్‌పిలు సుప్రజ, కోటేశ్వరరావు, డిఎస్ మహేష్, శ్రీనివాసరావు, డిఎస్‌పిలు శ్రీనివాసరావు, సీతారామయ్య, పోతురాజు, స్రవంతి రాయ్, జేస్సి ప్రశాంతి మేడం ప్రకాష్ బాబు, మణి కంఠ, చంద్ర శేఖర్ రావు తదితరులు పాల్గొన్నారు.

మానవ అస్తిపంజరాలను పరిశీలిస్తున్న విద్యార్థులు

వైద్యకళాశాలను సందర్శించిన భాష్యం విద్యార్థులు

ప్రజాశక్తి - గుంటూరు

పూర్తిస్థాయి వైద్య విజ్ఞానాన్ని పాఠశాల స్థాయినుండే అవగాహన కల్పించుకోవటం అవసరమని భాష్యం విద్యాసంస్థల ఛైర్మన్ భాష్యం రామకృష్ణ అన్నారు. భాష్యం విద్యాసంస్థలకు చెందిన 8వ తరగతి నుండి 10వ తరగతి వరకు చదువుచున్న మెడిఎయిమ్స్ విద్యార్థులు మంగళవారం గుంటూరు వైద్యకళాశాలను సందర్శించారు. ఫోరెన్సిక్ ల్యాబ్, పాథాలజీ ల్యాబ్, అనాటమీ విభాగాలకు సంబంధించిన మ్యూజియమ్లను సందర్శించారు. టిబి, లంగ్స్, క్రానిక్ లివర్ కేన్సర్, బ్రెయిన్ హిమరేజ్, స్యూడో మిగ్జిమా, హార్స కిడ్నీ, హెప్టోమాలివర్, 20, 18 వారాల ప్లాసన్టా, ఫీటస్ వివిధ విషప్రయోగాలకు లోనైన మానవ అవయువాలు, శరీర భాగాలను సందర్శించారు. పలు అంశాలపై ఆయా విభాగాధిపతుల నుండి వివరాలు తెలుసుకున్నారు.

రసాయనాల్లో ఉన్న అవయవాలను పరిశీలిస్తున్న విద్యార్థులు

యుటిఎఫ్ క్యాలెండర్, డైరీ ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్, ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు తదితరులు

యుటిఎఫ్ డైరీ, క్యాలెండరు ఆవిష్కరణ

ప్రజాశక్తి - గుంటూరు

యుటిఎఫ్ గుంటూరు జిల్లా నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌ను శనివారం జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాలరెడ్డి, ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు ఆవిష్కరించారు. జిఓ బుక్‌ను డిఇఓ శైలజ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి ఆదిలక్ష్మి, కళాధర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులతో పాటు ఉద్యోగులందరికీ యుటిఎఫ్ డైరీ, జిఓ బుక్ ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. జీఓ బుక్, డైరీ కావలసిన వారు బ్రాడీపేట 2/6లో ఉన్న యుటిఎఫ్ కార్యాలయంలో అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర ప్రచురణల కమిటీ ఛైర్మన్ ఎం.హనుమంతరావు, ఉర్దూ డి.ఐ. ఖాసిం, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు సిహెచ్.ఆదినారాయణ ఎమ్‌డి షకీలా బేగం, ఎం.గోవిందు జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు ఎం.గురుబ్రహ్మం, కె.రంగారావు బి.ప్రసాద్ ఎం.ధనరాజారావు సుబ్బారాయుడు పాల్గొన్నారు.

30 నాటికి పింఛన్ల పరిశీలన పూర్తి కావాలి

ఉపాధి హామీ చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలి : పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

ఉపాధి హామీ పథకంలో పల్నాడు జిల్లాను ముందంజలో ఉంచాలని, ఈ నెల 30వ తేదీ నాటికి పింఛన్ల వెరిఫికేషన్ త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని వైఎస్ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి మున్సిపల్ కమిషనర్లు, మండలాధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర మాట్లాడుతు ఉపాధి జాబ్‌కార్డుల రెక్టిఫికేషన్లను పూర్తి చేసి, లేబర్ బడ్జెట్‌ను సద్వినియోగం చేసుకోవాలని, వారాంతం మస్టర్ కంప్లీట్ చేసి సోమవారానికి పేమెంట్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాకు సంబంధించి 8280 పింఛన్లు వెరిఫికేషన్ లక్ష్యంగా ఉందన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన సమస్యలను సకాలంలో పరిష్కరించాలన్నారు. ఎప్పటికప్పుడు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన పనులను అప్లోడ్ చేయాలన్నారు. ఆయుష్మాన్ భారత్‌కు సంబంధించి ఈ కేవైసీ పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. వాలంటీర్లు ఇంటింటికి వెళ్లి రీసర్వే చేయాలన్నారు. జగనన్న స్వచ్ఛ సంకల్పం సంబంధించి పూర్తి వివరాలను నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో డ్వామా పీడీ జోసెఫ్ కుమార్, జిల్లా అభివద్ధి అధికారి మహాలక్ష్మి, సిపిఓ ముక్తేశ్వరరావు, డిపిఓ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

అధికారుల వద్ద రైతుల రుణ వివరాలుండాలి

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

అగ్రికల్చరల్ అసిస్టెంట్ల వద్ద తప్పనిసరిగా రైతులు బ్యాంకులోన్‌లు తీసుకున్న వివరాలు ఉండాలని ఆ విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని స్పందన హాలులో వ్యవసాయ అనుబంధ శాఖలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిఎం కిసాన్ సమ్మాన్‌కి సంబంధించి ఈ కేవైసీ ఎంతవరకు జరిగింది వివరాలు అడిగి తెలుసుకున్నారు. డిసెంబర్ 31 నాటికి లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. ప్రాథమిక రంగంలో జిల్లా ముందంజలో ఉండాలన్నారు. ఆత్మహత్యలు చేసుకుంటున్న రైతుల వివరాలను సేకరించాలని, ఆత్మహత్యకు గల కారణాలను కూలం కుషంగా తెలుసుకోవాలన్నారు. జిల్లాలోని రైతులందరికీ వైయస్సార్ బీమా వర్తింప చేయించాలన్నారు. ఎవరికైనా ఎక్స్‌గ్రేషియో చెల్లించేటప్పుడు, సిసిఆర్ కార్డు, ఈ కేవైసీ చేయించుకుని ఉన్నారా లేదా గుర్తించాలన్నారు. రైతుల ఆత్మహత్యలను నివారించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. రబీ మరియు ఖరీఫ్ పంటల మధ్య సమయంలో ఎవరైనా రైతులు మూడవ పంటను వేస్తున్నారా వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులు ఉండే ప్రదేశాలను బట్టి వారికి ఆదాయం వచ్చే పంటలను సూచించాలన్నారు. మిక్స్ ఫార్మింగ్ పై రైతులు అవగాహన కల్పించి ప్రోత్సహించవలసిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి మురళి, హార్టికల్చర్ అధికారి జాన్ బెన్నీ, పశుసంవర్ధక శాఖ అధికారి కాంతారావు, కోపరేటివ్ అధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమ అనంతరం మిరప సాగుపై సమగ్ర యాజమాన్య పద్ధతులకు సంబంధించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు.

మిరప సాగుకు సంబంధించిన పుస్తకాన్ని ఆవిష్కరించిన కలెక్టర్ తదితరులు

మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన

- భారీగా తరలి వచ్చిన ప్రజలు
- పాల్గొన్న తానా అధ్యక్షులు అంజయ్య చౌదరి, హైకోర్టు జడ్జి జస్టిస్ రామకృష్ణ
- నాలుగు వేల మందికి ఉచితంగా వైద్య సేవలు

ప్రసంగిస్తున్న జస్టిస్ రామకృష్ణ ప్రసాద్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

తానా, గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రవాహ భారతీయుడు, వ్యాపారవేత్త కోట వంశీ ఆర్థిక సహకారంతో మంగళవారం గుంటూరులోని ఏసీ కాలేజీలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరంకు ప్రజలు పెద్దసంఖ్యలో హాజరు అయ్యారు. దాదాపు నాలుగు వేల మంది వరకు శిబిరానికి వచ్చి పరీక్షలు చేయించుకున్నారని కోట వంశీ తెలిపారు. ఉచిత వైద్య శిబిరాన్ని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి. రామకష్ణ ప్రసాద్ ప్రారంభించారు. మానవసేవే మాధవ సేవని నిరూపించిన తానా, గ్రేస్ ఫౌండేషన్ నిర్వాహకులకు ఆయన అభినందనలు తెలిపారు. దేశంలో విద్య, వైద్యమనేది ప్రజల ప్రాథమిక హక్కు అని స్పష్టం చేశారు. ఎందరో పేదలు కార్పొరేట్ వైద్యానికి నోచుకోలేకపోతున్నారని, అలాంటి వారికి ఈ వైద్య శిబిరం ఒక వరమని పేర్కొన్నారు. వైద్య శిబిరానికి నాలుగు వేల మంది పేదలు రావడం సంతోషంగా ఉందన్నారు. మాతభూమి రుణం కొంతైనా తీర్చుకోవాలనే తలంపు రావడం, దీనిని ఆచరణలో చేసి చూపడం చాలా గొప్ప విషయమని చెప్పారు. టుబాకో బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్, ఎమ్మెల్యే షేక్ ముస్తఫా తదితరులు ఇలాంటి వైద్య శిబిరాల ద్వారా పేద ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. కోట వంశీ మాట్లాడుతూ వైద్య శిబిరంలో 27 మంది స్పెషలిస్టు వైద్యులు గుంటూరు, విజయవాడ, హైదరాబాద్ నుంచి వచ్చి సేవలందించారని వెల్లడించారు. ఇతర వైద్య సిబ్బంది 150 మంది వరకు ఉన్నారని, అవసరమైన వారందరికీ ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారని తెలిపారు. మొత్తం రూ.42 లక్షల రూపాయలతో నాలుగు వేల మంది నిరుపేదలకు పరీక్షలు, మందులు అందించామని తెలిపారు. తానా ప్రెసిడెంట్ లావు అంజయ్య చౌదరి, గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ ఛైర్మన్ డాక్టర్ చినబాబు, పారిశ్రామిక వేత్తలు ఛైర్మన్ గోరంట్ల పున్నయ్య చౌదరి, డాక్టర్ యార్లగడ్డ సుబ్బారాయుడు, రావి గోపాలకష్ణ, రవి పొట్లూరి, విద్యాధర్ గారపాటి, వెంకట్ పొత్తూరు, వెంకట్ గన్నె, క్రాంతి ఆలపాటి, యర్రా నాగేశ్వరరావు, రమేష్ చంద్ర, ఘంటా పున్నయ్య చౌదరి, శ్రీధర్ నాగళ్ల ఏసీ కాలేజీ ప్రిన్సిపాల్ కే మోజెస్, ట్రెజరర్ మోజెస్ ఆర్నాల్డ్ తదితరులు పాల్గొన్నారు. అతిథులను, తానా సభ్యులను వంశీ సత్కరించారు.

ప్రాంగణ ఎంపికల్లో చలపతి విద్యార్థులకు కొలువులు

ప్రజాశక్తి-గుంటూరు

బెంగుళూరు మెడిఅసిస్ట్ ఇన్సూరెన్స్ ప్రై లిమిటెడ్ కంపెనీవారు మంగళవారం ఎగ్జిక్యూటీవ్, సీనియర్ ఎగ్జిక్యూటీవ్ ఉద్యోగాలకు స్థానిక కళాశాలలో ప్రాంగణ ఎంపికలు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ నాదెండ్ల రామారావు తెలిపారు. ఎమ్‌పార్మసీ, బి.ఫార్మసీ ఆఖరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఈ ఎంపికలను మెడి అసిస్ట్ ఇన్సూరెన్స్ టీం హెడ్ ఎ.అంజమ్, హెచ్‌ఆర్‌లు శ్రీ లిఖిత, కిరణ్మయిలు నిర్వహించారు. మొత్తం 111మంది విద్యార్థులు పాల్గొనగా 21 మంది విద్యార్థులు ఆఖరి రౌండ్‌కు చేరుకున్నారని తెలిపారు. ఉద్యోగర్హత పొందిన విద్యార్థులు బెంగుళూరు మెడిఅసిస్ట్ కెంపెనీలో ఉద్యోగాలు చేస్తారని తెలిపారు. ఏడాదికి రూ. 2.6 లక్షల వేతనం ఇవ్వనున్నట్లు కంపెనీ ప్రతి నిధులు తెలిపారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను చలపతి విద్యా సంస్థల అధినేత వై.వి ఆంజనేయులు , కళాశాల ప్రిన్సిపల్ నాదెండ్ల రామారావు లు అభినందించారు.